భారత శక్తి®
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal
సంపుటి - 20 | సంచిక - 91 | హైదరాబాద్ | మంగళవారం 23-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00



12లో
మురికికాలువల మరమ్మతులు చేపట్టిన నగరపాలక అధికారులు

## నేటి భారతం

- కళ్ళు మూసుకుని భవిష్యత్ గురించి కలలు కనడం కాదు.. ఆ కలల సాకారం కోసం కృషి, పట్టుదల కూడా ఉండాలి.
- నిన్ను భారంగా భావించే బంధాలతో బలవంతంగా జీవించే కన్నా.. అటువంటి వారికి దూరంగా ఉంటూ ఒంటరిగా జీవించడం మేలు..
- నీ జీవితం నీ చేతుల్లోనే ఉంటుంది.. దాన్ని చక్కదిద్దుకోవాలనే ఆలోచన నీలో మొదలైతే ప్రతి సమస్యా నీకు చిన్నదిగానే కనిపిస్తుంది.
- అలాగే కోరికలు లేని జీవితాన్ని నువ్వు కోరుకుంటే..
  చింతలులేని జీవితం నీ సొంతమవుతుంది..
  అందుకే ఎప్పుడు బంధాలకు విలువ ఇవ్వాలి..
- చక్కటి సంబంధానికి కావాల్సిన మూడు ముఖ్యమైన అంశాలు..
  ఒకటి కన్నీరు రాని కళ్లు..
  రెండు అబద్ధాలు చెప్పని పెదవులు..
  మూడవది నిజమైన ప్రేమ..
- ఈ రోజుతో మీ జీవితం పూర్తి అయితే ఏ పనులను చేయకపోయినప్పటికీ పర్వాలేదు అని అనుకుంటారో.. అలాంటి పనులను మాత్రమే రేపటికీ వాయిదా వేయండి.

-ఇంద్రపల్లి గోవర్ధన్


11లో

# ట్రంప్ హెచ్-1బీ వీసా దెబ్బ

## టేకాఫ్‌కు ముందు విమానం దిగేసిన భారతీయులు

- ట్రంప్ హెచ్-1బీ వీసా నిర్ణయంతో తీవ్ర గందరగోళం
- టేకాఫ్‌కు ముందు ఎమిరేట్స్ విమానం దిగేసిన భారతీయులు
- మూడు గంటల పాటు ఆలస్యమైన విమాన ప్రయాణం

# సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

- ఒక్కో కార్మికుడికి రూ. 1,95,610 పంపిణీకి నిర్ణయం
- మొత్తంగా రూ. 819 కోట్లు విడుదల చేయనున్నట్లు
- 71 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికులకు లబ్ధి


11లో

# పండుగలు ప్రమాదాలు కొనితేవద్దు..


12లో

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సందడి నెలకొంది.. ఒకవైపు బతుకమ్మ ఆటలతో మహిళలు, యువతులు కనువిందు చేస్తుంటే.. మరోవైపు దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా మొదలైయ్యాయి.. వీధి వీధిలో అమ్మవారి విగ్రహాలతో మండపాలు వెలిశాయి.. పైగా ప్రభుత్వ సెలవులు కూడా కావడంతో ఇంటిల్లిపాది ఈ వేడుకల్లో భాగస్వాములు అవుతున్నారు.. తెలంగాణ ప్రభుత్వం కూడా వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ వారు జాగ్రత్తలు తీసుకున్నారు.. బతుకమ్మ చీరల పంపిణీ కూడా చేస్తున్నారు.. వినూత్నంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.. ప్రజలు కూడా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగ వేడుకలు నిర్వహించుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది..


11లో

# గుజరాత్ తీరంలో మంటల్లో చిక్కుకున్న నౌక


- గుజరాత్‌లోని పోర్‌బందర్ జెట్టీ వద్ద ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం
- బియ్యం, పంచదార లోడుతో సోమాలియా వెళ్లాల్సి ఉండగా ఘటన
- వేగంగా వ్యాపించిన మంటలు

## నేటి నుంచి కొత్త జీఎస్టీ...

11లో

# హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

- అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్ సహా పలు ప్రాంతాల్లో వర్షం
- పలు ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నిలిచిన నీరు

11లో




11లో

# యుద్ధం అక్కర్లేదు..

పీవోకే మనదే అవుతుంది: రాజ్‌నాథ్ సింగ్

# ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు.. 'జనతా గ్యారేజ్': కేటీఆర్

- ఆర్ఆర్ఆర్ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని కేటీఆర్ హామీ
- సమస్యల పరిష్కారానికి తెలంగాణ భవన్‌లో న్యాయవాదుల సాయం
- అలైన్‌మెంట్లు మార్చడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని విమర్శ

11లో



# సంపాదకీయం

## గేమ్ ఛేంజర్ గా జీఎస్టీ సంస్కరణ

పెద్ద నోట్ల రద్దు, కరోనా పీడ దినాలు.. ఇలా అనేక సందర్భాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన అలా ప్రసంగించిన ప్రతి సందర్భంలోనూ సంచలన విషయాలను పంచుకున్నారు. ఆ విషయాలన్నీ జాతిని జాగృతం చేసే దిశగా నడిచాయి. విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. తాజాగా నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈసారి కూడా సంచలన విషయాలను పంచుకున్నారు.అమెరికా హెచ్ వన్ బీ వీసాల మీద తీసుకున్న నిర్ణయం.. ఓట్ చోరీ.. నేపాల్ దేశంలో ఆందోళనలు.. ఇన్ని పరిణామల మధ్య నరేంద్ర మోడీ ఏదో ఒక కీలక విషయాన్ని వెల్లడిస్తారని.. సంచలన విషయాలను ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. దానికి తగ్గట్టుగానే నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. సంచలన విషయాలను వెల్లడించారు.. ఇటీవల కాలంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారతదేశంలో కూడా నేపాల్ మాదిరిగానే జెడ్ జనరేషన్ ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు . ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. ఏ క్షణమైనా సరే మనదేశంలో పెను ప్రకంపనలు చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మాటలు ఏ రాజకీయ నాయకుడు అన్నా పెద్దగా పట్టింపు ఉండేది కాదు. రాహుల్ గాంధీ ఈమాటలు అనడంతో సాధారణంగానే చర్చ మొదలైంది. దీనిపై బీజేపీ కూడా ఘాటుగానే స్పందించినప్పటికీ.. మోడీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దేశంలో నవరాత్రి ఉత్సవాలు మొదలవుతున్నాయి. దాంతోపాటు జీఎస్టీ బచత్ ఉత్సవం కూడా మొదలవుతుంది. ఐదు శాతం, 18% జిఎస్టి స్లాబులు మాత్రమే అమల్లోకి వస్తాయి. దీంతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లి విరుస్తుంది. ఈ సంస్కరణ భారతదేశ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. ఆత్మనిర్బర్ దిశగా ఇది కీలకమైన ముందడుగు. గతంలో ప్రతి చోట రకరకాల పన్నులు విధించేవారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేవారు. ప్రజలను గందరగోళం నుంచి బయటపడడానికి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. వన్ నేషన్ వన్ టాక్స్ స్వప్నం సాకారం అయింది. సరికొత్త చరిత్ర సృష్టించేందుకు ఈ సంస్కరణలు తోడ్పడతాయి. ఫలితంగా పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని నెక్స్ట్ జెన్ జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతుందని" నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ జనరేషన్ జెడ్ తరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. వారిలో నేపాల్ తరహాలో ఉద్రేకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మాత్రం అలాంటివి చేయకుండా ఈ జనరేషన్ కు జీఎస్టీ మార్పుల వల్ల లాభం జరుగుతుందని పేర్కొన్నారు. యువత వల్లే దేశం ఈ స్థాయిలో ఉందని.. వారి కోసం ఏమైనా చేస్తామని ప్రకటించారు. తద్వారా రాహుల్ గాంధీ ఆశలపై నీళ్లు చల్లారు నరేంద్ర మోడీ.జీఎస్టీ స్వరూపంలో కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై స్టాండర్డ్ , మెరిట్ పేరుతో జీఎస్టీలో రెండే శ్లాబులు ఉంటాయి. వాటిలో ఒకటి 5% కాగా రెండోది 18%.గుట్కా, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లపై మినహా మిగిలిన ఉత్పత్తులపై పన్ను మార్పులు అమల్లోకి వచ్చాయి. తలనూనెలు, కార్న్‌ఫ్లేక్స్, టీవీలు, వ్యక్తిగత ఆరోగ్య ఉత్పతులు వంటివాటిపై పన్ను తగ్గనుంది. రోటీ, పరోటాలపై జీఎస్టీ సున్నా. ప్రాణాధార ఔషధాలపై ఎటువంటి పన్ను లేదు. ఖరీదైన కార్లు, పొగాకు ఉత్పత్తులు-సిగరెట్లపై ప్రత్యేకంగా 40 శాతం స్లాబును ప్రతిపాదించారు. దాదాపుగా వ్యక్తిగత వస్తువులన్నింటికీ పన్ను తగ్గించడం ద్వారా దేశీయ వినిమయాన్ని పెంచి.. అమెరికా సుంకాల భారం నుంచి కొంత ఉపశమనం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ వాణిజ్యాన్ని పరుగు పెట్టించేందుకు, వినియోగాన్ని గణనీయంగా ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకున్న జీఎస్టీ మండలి.. పండగ సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చింది. వ్యక్తిగత, ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీ రద్దు చేయడం.. కోట్ల మందికి బీమాను చేరువ చేసేందుకు ఉపయోగపడనుంది. అన్ని నిర్ణయాలనూ ఏకాభిప్రాయంతో తీసుకున్నామని, ఏ ఒక్క రాష్ట్రం వీటిని వ్యతిరేకించలేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై స్థూలంగా ఒక ప్రతిపాదనను కేంద్రం రూపొందించింది. దీనిపై జీఎస్టీ మండలి ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంది. జీఎస్టీ రేట్లలో కొత్త మార్పులతో చిరు వ్యాపారులు, రైతులు, మధ్యతరగతి, మహిళలు, యువతకు మేలు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఇన్సూరెన్స్ రంగానికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అన్ని రకాల హెల్త్, లైఫ్, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ క్రమంలో ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గుతుంది బీమా రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ తగ్గింపు పూర్తిస్థాయిలో అమలు కాకపోవచ్చనే అంచనాలూ లేకపోలేదు. రాష్ట్రాల ఆదాయాన్ని 14 శాతం పెంచి, రక్షించాలని జీఎస్టీ విధానాన్ని రూపొందించగా.. గత అయిదేళ్లలో రాష్ట్రాలు రూ.63,265 కోట్లు అదనంగా పొందాయని తెలిపింది. జీఎస్టీ ఆదాయం పెంచుకోవడం ద్వారా ప్రతి రూ.100 జీఎస్టీలో రాష్ట్రాలకు దాదాపు రూ.70.5 వస్తున్నట్లు వివరించింది. జీఎస్టీ ప్రవేశ పెట్టినప్పుడు రాష్ట్రాలకు అయిదేళ్ల వ్యవధిలో 14 శాతం వార్షిక ఆదాయ పెరుగుదలకు హామీ ఇచ్చారు. విలాస వస్తువులు, హానికర ఉత్పత్తులపై సెస్ వసూలు చేసి, ఆదాయ లోటును భర్తీ చేస్తామనీ పేర్కొన్నారు. కానీ, కరోనా మహమ్మారి కారణంగా ఆదాయ లోటు పెరిగింది. కేంద్రం రూ.2.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుని, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు అందించింది. మొత్తంగా రాష్ట్రాలు రూ.9.14 లక్షల కోట్ల పరిహారం పొందాయి. ఇది హామీ ఇచ్చిన మొత్తంతో పోలిస్తే రూ.63,265 కోట్లు అధికమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రాలు జీఎస్టీ పేరంగా నికర ఆదాయంతోనే ఉంటాయని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. 9.5 శాతం నికర జీఎస్టీ రేటుతో అదనంగా రూ.52,000 కోట్ల ఆదాయం వస్తుందని, దీంట్లో రాష్ట్రాలకు, కేంద్రానికి రూ.26,000 కోట్ల చొప్పున వస్తుందని వివరించింది. రాష్ట్రాల వారీగా అంచనాలు కూడా నివేదికలో పేర్కొంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ అంచనా ఆదాయం రూ.35,863 కోట్లుగా ఉండగా, జీఎస్టీ సవరణ అనంతరం రూ.52,622 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. అంటే, రూ.16,759 కోట్ల వరకూ ఆదాయం పెరగనుందని పేర్కొంది. తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ఆదాయం రూ.42,075 కోట్లు వచ్చే అవకాశం ఉండగా, సవరణ తర్వాత రూ.8,705 కోట్లు అదనంగా మొత్తం రూ.50,779 కోట్లు రావొచ్చని నివేదిక వెల్లడించింది. గతంలో జులై 2018, అక్టోబరు 2019లో రేట్లు తగ్గించినప్పుడు తాత్కాలికంగా 3-4% రాబడి తగ్గినా తర్వాత 5-6% వృద్ధితో రాష్ట్రాలకు మరింత ఆదాయం వచ్చిందని పేర్కొంది. మొత్తంగా రూ.లక్ష కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొంది.

# బొండాకు ఫ్రస్టేషన్ ఎందుకు

విజయవాడ, సెప్టెంబర్ 22, (**భారతశక్తి ప్రతినిధి**)
టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జనసేన అంటే పడటం లేదా? ఆయన అసెంబ్లీ సమావేశాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేయడాన్ని అనేక కోణాల్లో విశ్లేషణలు వెలువడుతున్నాయి. బొండా ఉమామహేశ్వరరావు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆయన ఈసారి మంత్రి పదవిని ఆశించారు. కానీ జనసేనతో పాటు టీడీపీలో ఉన్న కాపు సామాజికవర్గం నేతలకు ఎక్కువ మంత్రి పదవులు ఇవ్వాల్సి రావడంతో బొండా ఉమామహేశ్వరరావుకు తాను ఆశించినట్లు మంత్రి పదవి దక్కలేదు. భవిష్యత్ లోనూ దక్కుతుందన్న గ్యారంటీ మాత్రం కనిపించడం లేదు సామాజికవర్గం.. జిల్లా కోటాలో... ఎందుకంటే బొండా ఉమామహేశ్వరరావు కాపు సామాజికవర్గం కావడంతో పాటు కృష్ణా జిల్లా కావడంతో జిల్లా కోటాలో, సామాజికవర్గం కోటాలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు భవిష్యత్ లో లేవన్నది అంచనా. ఎందుకంటే పొంగూరు నారాయణకు ఖచ్చితంగా కేబినెట్ లో కీలకంగా ఉంటారు. అదే సమయంలో కృష్ణా జిల్లా నుంచి ఇతర సామాజికవర్గానికి చెందిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జనసేన వల్లనే తనకు మంత్రి పదవి దక్కలేదన్న అక్కసు ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. టీడీపీలో ఒక సంప్రదాయం ఉంది. ఏ సామాజికవర్గం వారిని ఆ సామాజికవర్గం వారి చేతనే విమర్శలు చేయిస్తారు. అలాడే టీడీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారా? లేక ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయమా? అన్నది తేలాల్సి ఉంది. కాలుష్య నియంత్రణ మండలి విభాగానని కూడా చూస్తున్న పవన్ కల్యాణ్ ను నేరుగా విమర్శించకపో?యినా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిత్వ శాఖపై విమర్శలు చేయడంతో జనసైనికులు మండిపడుతున్నారు. గతంలో అంటే 2019 లో కాపు సామాజికవర్గం టీడీపీ నేతగా బొండా ఉమామహేశ్వరరావు పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలను ఈ సందర్భంగా జనసైనికులు గుర్తు చేస్తున్నారు. అయితే దీనిపై పవన్ కల్యాణ్ కూడా ఒకింత సీరియస్ గానే ఉన్నట్లు కనపడుతుంది. ఈ విషయంలో ఆయన పర్యావరణ శాఖ అధికారుల నుంచి పూర్తి వివరాలను ఇప్పటికే తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దీనిపై ఒక రిపోర్టు ఇవ్వడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు కనపడుతున్నారని అంటున్నారు. . బొండా ఉమామహేశ్వరరావు తన నియోజకవర్గం పరిధిలో ఒక కంపెనీపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడమే కాకుండా, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారని చెబుతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలిని బొండా ఉమామహేశ్వరరావు కోరారంటున్నారు. వెంటనే అధికారులు ఆ కంపెనీకి నోటీసులు ఇవ్వడమే కాకుండా చర్యలకు కూడా సిద్ధమవుతున్న సమయంలో తిరిగి ఫిర్యాదు చేసిన బొండా ఉమామహేశ్వరరావు చర్యలు తీసుకోవద్దని కోరినట్లు పవన్ కల్యాణ్ కు ఇచ్చిన నివేదికలో అధికారులు తెలిపినట్లు సమాచారం. అంటే ఇక్కడ ఏదో జరిగిందని పవన్ కల్యాణ్ కూడా అనుమానిస్తూ దీనిపై చంద్రబాబు వద్ద పంచాయతీ పెట్టాలని నిర్ణయించుకున్నారని సమాచారం. అయితే టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తాను లేవనెత్తిన ప్రశ్నలకు వెంటనే రియాక్ట్ అయ్యారని, వేగంగా స్పందించారని ట్వీట్ చేయడం చూస్తుంటే .. నాయకత్వం తలంటినట్లే కనిపిస్తుంది.

వివాదం ముగిసినట్టేనా

ఏపీ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నోత్తరాల సమయంలో చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులపై బొండా ఉమా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో పాటు పవన్ పై తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అసలు బొండా ఉమా ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయవలసి వచ్చిందో పూర్తి స్థాయి విచారణకు పవన్ సిద్ధమయ్యారనే ప్రచారం సాగింది. ఈ ఎపిసోడ్ ను సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లాలని పవన్ అధికారులకు సూచించారని ప్రచారం జరిగింది. ఈ తరుణంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని పొగుడుతూ బొండా ఉమా ఎక్స్ వేదికగా వరుస ట్వీట్లు పెట్టారు. 'అసెంబ్లీలో ప్రస్తావించిన సమస్యను విని తక్షణమే స్పందించి పరిష్కరించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు నా ధన్యవాదాలు. ప్రజా సమస్యలపై ఇంత వేగంగా, నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవడం మీలో ఉన్న సేవా తపనకు నిదర్శనం. ఇలాంటి నాయకత్వం వల్లే ప్రజల్లో మీపై మరింత గౌరవం, విశ్వాసం, మంచి పేరు పెరుగుతోంది' అని బొండా ఉమా ట్వీట్ పెట్టారు. వివాదం ముగిసినట్లేనా? బొండా ఉమా కాలుష్య నియంత్రణ మండలి పనితీరుపై లేవనెత్తిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభలో



సమాధానం ఇచ్చారు. ఈ వీడియోను డిప్యూటీ సీఎం అధికారిక ఖాతాలో పోస్టు చేశారు. వీడియోపై స్పందిస్తూ?అసెంబ్లీలో తాను ప్రస్తావించిన సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలు అని బొండా ఉమా ట్వీట్ చేశారు. దీంతో వివాదం ముగిసినట్లేనని పలువురు నెటిజన్లు ట్వీట్లు చేస్తు?న్నారు. బొండా ఉమాపై జనసైనికులు ఫైర్. విజయవాడలోని ఓ పరిశ్రమ వల్ల కాలుష్యం జరుగుతోందని, దానిని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు దృష్టికి తీసుకెళ్తే స్పందించలేదని ఎమ్మెల్యే బొండా ఉమా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ కూడా అందుబాటులో ఉండడంలేదని అన్నారు. దీంతో జనసైనికులు హర్ట్ అయ్యారు. ఉదయం నుంచి బొండా ఉమాపై ఎక్స్ వేదికగా సెటైర్లు మారుమోగాయి. దీంతో డ్యామేజ్ కంట్రోల్ కు దిగిన బొండా ఉమా.. పవన్ పై పొగడ్తలు కురిపించారు

# మండలి చైర్మన్ పై అవిశ్వాసం ,,?

అమరావతి సెప్టెంబర్ 22, (**భారతశక్తి ప్రతినిధి**)
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద షాక్ తప్పదా? శాసనమండలి కూటమి హస్తగతం కానుందా? మండలి చైర్మన్ పై వేటు తప్పదా? కోర్టులో ప్రతికూల తీర్పు రాబోతుందా? చైర్మన్ పై కూటమి అవిశ్వాస తీర్మానం పెట్టనుందా? అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద నష్టం తప్పదా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో స్పష్టమైన బలం ఉంది. అయితే చాలామంది ఎమ్మెల్సీలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటికే రాజీనామా చేసిన వారికి ఆమోదం లభించలేదు. చైర్మన్ మోసేన్ రాజు పెండింగ్లో పెట్టారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు.. చైర్మన్ ఫార్మేట్లో రాజీనామా లేఖలు పంపించినా ఆమోదానికి మాత్రం నోచుకోలేదు. చైర్మన్ మోసేన్ రాజు ఉద్దేశపూర్వకంగానే వాటిని తొక్కి పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అందుకే ఎమ్మెల్సీల రాజీనామా విషయంలో కూటమి వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. దీంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలుపోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళం వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జూకీయ ఖానం తదితర ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. మరికొందరు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ మండలి చైర్మన్ మోసేన్ రాజు రాజీనామాలకు ఆమోదం తెలపడం లేదు. అలా ఆమోదం తెలిపిన మరుక్షణం వారి రాజీనామాలు అమల్లోకి వస్తాయి. మళ్లీ ఎన్నికలు జరిగి ఆ ఎమ్మెల్సీ స్థానాలు కూటమి ఖాతాల్లో పడతాయి. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గి కూటమి బలం పెరుగుతుంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఆదేశాలతోనే చైర్మన్ మోసేన్ రాజు అలా వ్యవహరిస్తున్నట్లు ప్రచారంలో ఉంది.అయితే ఇటీవల జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయ మంగళం వెంకటరమణకోర్టును ఆశ్రయించారు. తన రాజీనామా వ్యవహారంలో కోర్టు ఆదేశాలు పాటించడం లేదని.. వాయిదాల మీద వాయిదాలు కోరుతున్నారని.. తనకు అనవసరంగా ఖర్చు అవుతుందని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ విషయంలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆగ్రహించిన కోర్టు పదివేల రూపాయల జరిమానా విధించడం సంచలనంగా మారింది.

దీంతో ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారంలో కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు కూటమి పార్టీలో చేరారు. ఇదివరకే జయ మంగళం వెంకటరమణ జనసేనలో చేరారు. జాకీయా ఖానం, పోతుల సునీత బిజెపిలో చేరారు. తాజాగా మర్రి రాజశేఖర్, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ టిడిపిలో చేరారు. దీంతో కోర్టు ఏదో ఒక తీర్పు ఇస్తుందన్న నేపథ్యంలోనే వీరంతా ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.ఒకవేళ వీరి రాజీనామాలు ఆమోదం పొందితే మాత్రం వెనువెంటనే కూటమి మండలి చైర్మన్ మూసేన్ రాజు పై అవిశ్వాసం పెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్సీలు చాలామంది కూటమికి అనుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వాస్తవానికి 2028 వరకు మోసేన్ రాజు ఎమ్మెల్సీ పదవి ఉంది. అప్పటివరకు ఆయన చైర్మన్గా కొనసాగే పరిస్థితి ఉండేది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మోసేన్ రాజు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అందుకే ఆయనపై అవిశ్వాసం పెట్టి తొలగించేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# వ్యూహం మారుస్తున్న చంద్రబాబు



గుంటూరు, సెప్టెంబర్ 22,(**భారతశక్తి ప్రతినిధి**)
శాసనమండలి సభ్యుల విషయంలో టీడీపీ ఇక ఎక్కువ కాలం వెయిట్ చేసే అవకాశం కనిపించడం లేదు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది మందికి పైగానే వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి రాజీనామా చేశారు. అయితే శాసనమండలి ఛైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించలేదు. దీంతో శాసనమండలిలో కూటమి కంటే వైసీపీ బలం ఎక్కువగా ఉండటంతో వాయిస్ రెయిజ్ చేస్తుంది. శాసనమండలిని స్థంభింప చేస్తుంది. శాసనసభకు గైర్హాజరవుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు, శాసనమండలి విషయానికి వచ్చే సరికి సభకు హాజరై అధికార పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజీనామాలు ఆమోదం పొందితే తిరిగి ఎన్నికయ్యేది కూటమి పార్టీలకు చెందిన వారే. దాదాపు పదిహేను నెలల పాటు శాసనమండలి ఛైర్మన్ ఎమ్మెల్సీల రాజీనామాలను ఆమోదిస్తారని కూటమి పార్టీలు భావించాయి. కానీ ఛైర్మన్ నిర్ణయం కావడంతో రాజీనామాలపై ఏం చేయలేని పరిస్థితి. ఇప్పటికి మండలిలో వైసీపీకి సభ్యుల బలం ఎక్కువగా ఉంది. బిల్లుల విషయంలో ఇప్పటి వరకూ ఇబ్బందులు కలగకపోయినా.. వాదనలు, విమర్శల విషయంలో వారిదే పై చేయి అవుతుంది. మండలి సమావేశాలు వాయిదా పడుతున్నాయి.

దీంతో కూటమి పార్టీలు ఇక లాభం లేదని ఒక నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్సీలను అధికారికంగా తమ పార్టీలో చేర్చుకుని మండలిలో కొంత బలం పెంచుకునే ప్రయత్నం మొదలు పెట్టింది.. పోతుల సునీత, జకియా ఖానమ్ లు బీజేలో చేరారు. తాజాగా మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తి టీడీపీలో అధికారికంగా చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు నేటి నుంచి సభలో టీడీపీ సభ్యులుగానే తమ గళం విప్పనున్నారు. అప్పుడు ఇరుకున పడేది వైసీపీ మాత్రమే. ఇదే వ్యూహాన్ని మిగిలిన రాజీనామాలు చేసిన ఎమ్మెల్సీల విషయంలోనూ అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీలు కూటమి పార్టీల కండువాలు అధికారికంగా కప్పుకోవడంతో మిగిలిన వారు కూడా త్వరలోనే టీడీపీ, జనసేన, బీజేపీలలో అఫిషియల్ గా చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మండలి ఛైర్మన్ రాజీనామాలు ఆమోదించకపోవడంతో చంద్రబాబు వ్యూహం మార్చి ఇలా తన బలం పెంచుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# జగన్‌కు మాస్ ర్యాగింగ్

విజయవాడ, సెప్టెంబర్ 22,(**భారతశక్తి ప్రతినిధి**)
అసెంబ్లీ సమావేశాలకు రాను, రాబోను అని జగన్ ఖరాఖండిగా చెప్పేశారు. ప్రతిపక్ష నేత హోదా అనేది కేవలం ఒక సాకు మాత్రమే. అసెంబ్లీకి వస్తే 164మంది ఎమ్మెల్యేల మధ్య 11మందితో తాను నెగ్గుకు రాలేనని జగన్ కి తెలుసు. అందుకే జగన్ అసెంబ్లీకి మొహం చాటేశారు. మరి కూటమి ఊరుకుంటుందా. సామ, దాన, భేద, దండోపాయాలు ప్రయోగిస్తోంది. తొలి సమావేశాల్లో రఘురామకృష్ణంరాజు, జగన్ చెవిలో అసెంబ్లీకి రావాలని ప్రేమగా చెప్పారు. జగన్ కుదరదన్నారు. ఇప్పుడు అనర్హత వేటు అంటున్నారు. దీనికి కూడా జగన్ ఒక లాజిక్ రెడీగా పెట్టుకున్నారు. అయితే కూటమి నేతలు ఓ పట్టాన ఈ విషయాన్ని వదిలిపెట్టడం లేదు. పదే పదే జగన్ అసెంబ్లీకి రావాల్సిందేనంటూ రోజుకొకరు మీడియా ముందుకొచ్చి విమర్శిస్తున్నారు. ఈ మాస్ ర్యాగింగ్ ని జగన్ తట్టుకోగలరా? జగన్ చిన్నపిల్లాడా? అసెంబ్లీకి వెళ్లి అధ్యక్షా అని అనాలనేది చాలామంది కల అని, అయితే జగన్ పుణ్యమా అని ఆ కల వైసీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు లేదని ఎద్దేవా చేశారు మంత్రి వంగలపూడి అనిత. ప్రజా సమస్యలపై చర్చించడానికి అసెంబ్లీ ఒక మంచి వేదిక అని, ఆ వేదికను వాడుకోకపోవడం, తనతోటి గెలిచిన ఎమ్మెల్యేలను కూడా ఆవైపు వెళ్లొద్దని చెప్పడం సరికాదన్నారు. ఇక ప్రతిపక్ష నేత హోదాపై కూడా మంత్రి సెటైర్లు పేల్చారు. ప్రతిపక్ష హోదా కావాలని చిన్న పిల్లాడిలా జగన్ మారం చేస్తున్నారని, అదేమైనా చాక్లెట్టా, బిస్కెట్టా అని ప్రశ్నించారు. అది కూడా కరెక్టేకదా.. గత అసెంబ్లీ నుంచి చంద్రబాబు వెళ్లిపోయిన సందర్భాన్ని ఇటీవల వైసీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. అయితే చంద్రబాబు తానొక్కరే అసెంబ్లీనుంచి వెళ్లిపోయారని తన ఎమ్మెల్యేలను మాత్రం అసెంబ్లీకి వెళ్లాలనే చెప్పారన్నారు అనిత. మరిప్పుడు జగన్ చేస్తున్నదేంటని ఆమె ప్రశ్నించారు. జగన్ తనతోపాటు గెలిచిన మిగతా ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి వెళ్లొద్దని చెబుతున్నారని, ఇదెక్కడి లాజిక్ అని నిలదీశారు. జగన్ రాకపోతే అసెంబ్లీ ఆగదని, వైసీపీ బ్యాచ్ అంతా రాజీనామా చేసి



వెళ్లినా నష్టమేమీ లేదన్నారు అనిత. ఉప ఎన్నికలు జరిగితే వారు కూడా ఓడిపోతారని కౌంటర్ ఇచ్చారు. అనర్హత వేటు? అనర్హత వేటు నిబంధనపై జగన్ అమాయకంగా మాట్లాడటం హాస్యాస్పదం అని అన్నారు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 188, 190(4) చదివితే అనర్హత వేటు గురించి ఏం రాసి ఉందో అర్థమవుతుందని జగన్ కి ఆయన సూచించారు. ఒకవేళ అది జగన్ కు అర్థం కాకపోతే న్యాయవాదులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు వరుసగా 60 రోజులు సభకు రాకపోతే అనర్హత వేటు వేయొచ్చని అన్నారు యనమల. అసెంబ్లీ రూల్స్.. తాజాగా అసెంబ్లీ రూల్స్ ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మరోసారి జగన్ కి గుర్తు చేశారు. జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ ఆ రూల్స్ ని పాటించాలని సూచించారు. అసెంబ్లీలో పార్టీలకు ఎంత సమయం కేటాయించాలనేది వారి బలాబలాలపై ఆధారపడి ఉంటుందని, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేకి కూడా మాట్లాడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మొత్తమ్మీద జగన్ అసెంబ్లీకి రావాలని కూటమి నేతలు కోరుకుంటున్నట్టు తెలుస్తోంద. అప్పట్లో చంద్రబాబుని ఇబ్బంది పెట్టినట్టే జగన్ ని కూడా ఇరుకున పెట్టాలనేది వారి ఆలోచన. అయితే జగన్ తెలివిగా తప్పించుకుంటున్నారు. ప్రతిపక్ష నేత హోదా పేరు చెప్పి అసెంబ్లీకి ఎగనామం పెట్టారు.

## పట్టు చీరల కోసం కుస్తీలు

కాకినాడ, సెప్టెంబర్ 22, (భారత శక్తి):
పట్టు చీరలంటే మహిళలకు విపరీతమైన పిచ్చి.. అలాంటి పట్టు చీరలు ఉచితంగా ఇస్తానంటే ఎవరు వద్దంటారు. అసలే వచ్చేది దసరా.. అమ్మవారి ఆలయానికి పట్టుచీరలో వెళ్లాలని ప్రతి మహిళ అనుకుంటుంది. అలాంటి పట్టు చీరల ఫ్రీగా వస్తున్నాయని తెలియడంతో భారీగాతరలి వచ్చారు అక్కడి మహిళలు. దీంతో అనుకున్నవాటి కంటే ఎక్కువ చీరలు తెప్పించి పంపిణీ చేశారు దాతలుతూర్పుగోదావరి జిల్లా, గోకవరంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దసరా కానుకగా మహిళలకు పట్టు చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ విషయం తెలిసిన స్థానికంగా ఉన్న మహిళలు చీరల కోసం భారీగా తరలి వచ్చారు. అయితే ఇక్కడ 2వేల పట్టు చీరలు పంపిణీ చేయాలనుకున్న ఆయన మహిళలు భారీగా రావడంతో వాటి సంఖ్యను.. మరిన్ని చీరలు తెప్పించి ఐదువేల చీరల వరకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో అమ్మవారి హంసగా ప్రతి ఒక్క మహిళ కూడా పట్టుచీరలు ధరించి భక్తి శ్రద్ధలతో హిందూ ధార్మికతను మరింత పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఈ చీరలు పంపిణీ కార్యక్రమానికి ముందడుగు వేశానంటూ కంబాల శ్రీనివాసరావు వెల్లడించారు.గత మూడు రోజుల కిందట ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా కుల మతాలకు అతీతంగా 8,000 మందికి పైగా పట్టుచీరలు పంపిణీ కార్యక్రమం చేశామని, ఇందులో భాగంగానే దసరా ఉత్సవాలకు కూడా మరో రెండు వేల మంది మహిళలకు చీరల పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. బంగారు వరలక్ష్మి కానుక ద్వారా 600 మందికి బంగారు రూపంలో పంపిణీ చేసిన.. రెండు నెలలు గడవక ముందే మళ్లీ కంబాల కానుక.. వనితల వేడుక అనే కార్యక్రమం ద్వారా పట్టుచీరల పంపిణీ చేశామని తెలిపారు.మహిళల్లో ఆధ్యాత్మికంగా చైతన్యం పెంపొందించేందుకు నిరంతరం సేవ చేసుకుంటానంటూ, వారికి ఏ సహాయం కావాలన్నా కంబాల కార్యాలయం ఎప్పుడూ తెరిచి ఉంటుందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా పేదలకు సేవ చేయడమే తన లక్ష్యం అని ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాలు చేపడుతున్నానట్టు చెప్పుకొచ్చారు.

# వైసీపీలో ఫ్యూచర్ లేదా

విశాఖపట్టణం, సెప్టెంబర్ 22(భారత శక్తి):
వైసీపీ ఎమ్మెల్యే పార్టీ మారతారన్న చర్చజరుగుతుంది. గత 2024లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వైసీపీ గెలిచిన పదకొండు స్థానాల్లో అరకు నియోజకవర్గం ఒకటి. అయితే అరకు నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్యే మత్స్యలింగం పార్టీని వీడతారన్న ప్రచారం జరుగుతుంది. కానీ ఆ ప్రచారం ఎంత మేరకు నిజం అన్నది మాత్రం తెలియడం లేదు. ఇంకా శాసనసభ ఎన్నికలకు మూడున్నరేళ్ల సమయం ఉంది. అయితే ఇప్పుడు పార్టీ మారితే తన రాజకీయ భవిష్యత్ ఏంటన్న దానిపై కూడా ఆయన సమాచాలోచనలు జరుపుతున్నారని తెలిసింది. అరకు నియోజకవర్గం ట్రాక్ రికార్డు చూస్తే పార్టీ మారి పొలిటికల్ ఫ్యూచర్ ను తనకు తానే ఇబ్బందుల్లోకి నెట్టేసుకోవడం ఎందుకన్న ఊగిసలాటలో కూడా ఉన్నారు.... అరకు నియోజకవర్గం ఏర్పాటయిన తర్వాత తొలిసారి 2009 లో మాత్రమే అక్కడ టీడీపీ గెలిచింది. ఎస్టీ నియోజకవర్గం కావడంతో అక్కడ 2009లో సివేరి సోమ గెలుపొందారు. తర్వాత 2014లో కిడారి సర్వేశ్వరరావు వైసీపీ నుంచి విజయం సాధించారు. అయితే మావోయిస్టుల దాడిలో మరణించారు. తర్వాత ఆ కుటుంబం నుంచి ఎవరిని అరకు నియోజకవర్గ ప్రజలు ఆదరించలేదు. కిడారి శ్రావణకుమార్ ను మంత్రిని చేసి తర్వాత వారికి రాజకీయ జీవితం లేదు. కిడారి సర్వేశ్వరరావు కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి మారారు. ఇప్పటి వరకూ ఆ కుటుంబం రాజకీయంగా ఎదగలేకపోయింది. 2019, 2024 ఎన్నికల్లోనూ వైసీపీ అక్కడ గెలిచింది. 2019లో చెట్టి ఫాల్గుణ, 2024లో రేగం మత్స్యలింగం వైసీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు ఇప్పుడు వైసీపీ ప్రతిపక్షంలో ఉంటుంది. సహజంగా అధికార పార్టీపై వచ్చే ఎన్నికల్లో వ్యతిరేకత తప్పనిసరిగా ఉంటుంది.



ఇప్పుడు పార్టీ మారి రాజకీయ భవిష్యత్ ను తనకు తానుగా సమాధి చేసుకోవడం ఎందుకన్న ఆలోచనలో ఆయన ఉన్నట్లు కనపడుతుంది. అయితే వైసీపీ పిలుపు నిచ్చిన కార్యక్రమాలకు దూరంగా ఉండటం మాత్రం చర్చనీయాంశమైంది. అందుకే ఆయన పార్టీ మారతారన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

ఈ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించకపోవడం మరింత ప్రచారానికి ఊతమిస్తుంది. గిరిజనుల్లో జనసేన నేత దూసుకు వెళు తుండటంతో తనకు ప్లస్ గా మారి వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలుంటాయన్న అంచనాలు కూడా ఆయన వేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సన్నిహితులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## యువకుడిని కాపాడిన అధికారులు

విశాఖపట్నం సెప్టెంబర్ 22(భారత శక్తి):
విశాఖపట్నం ఆర్కే బీచ్ లో సము ద్రపు అలల తాకిడికి కొట్టుకుపోయి న రాజస్థాన్ కు చెందిన భవాని సింగ్ అనే యువకుడిని పోర్ట్ మెరై న్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ సకాలంలో స్పందించి రక్షించారు. ఈత కోసం సముద్రంలోకి వెళ్లిన యువకుడు అలల ఉధృతికి కొట్టు కుపోవడంతో, అప్రమత్తమైన అధికారులు అతన్ని ఒడ్డుకు చేర్చి, వైద్య సహాయం, కౌన్సిలింగ్ అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## నూజివీడులో ఘనంగా 69వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు

నూజివీడు సెప్టెంబర్ 22(భారత శక్తి):
పట్టణంలో 69వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు అంగరంగ వైభవంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా నేటి నుండి 11 రోజులపాటు 11 అవతారాల్లో దర్శనం ఇవ్వనున్న శ్రీ కోటా మహిషాసుర మర్దిని అమ్మవారు.నూజివీడు పట్టణ నడిబొడ్డులో వేంచేసి ఉన్న శ్రీ కోట మహిషాసుర మర్దిని అమ్మవారు మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు.ఈ ఆలయం పూర్వం జమీందారుల కాలంలో నిర్మించినదని శత్రు రాజుల దండయాత్రకు వచ్చినప్పుడు ఈ అమ్మవారు జమీందారులకు సాంకేతాలు పంపేదని భక్తుల ప్రగాఢ నమ్మకం.నేడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఏదైనా కోరిక కోరితే తప్పకుండా అమ్మవారు తీరుస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.
====================================

# హాట్ టాపిక్ గా కవిత వ్యాఖ్యలు



హైదరాబాద్ సెప్టెంబర్ 22(భారత శక్తి):
తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు.. మళ్లీ హాట్ టాపిక్గా మారాయి. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు గురించి ఆమె చేసిన ఆరోపణలు, అలాగే తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై వెల్లడించిన అంశాలు చర్చనీయాంశమయ్యాయి. హరీష్ రావుపై ఆరోపణలు. శనివారం మీడియాతో మాట్లాడిన కవిత, హరీష్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భారీ అవినీతి చోటుచేసుకుందని ఆమె నేరుగా ఆరోపించారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ.. 2016లోనే నేను కేటీఆర్ను ఈ విషయంలో అలర్ట్ చేశాను, అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాను అప్పుడే సమస్యలను చూపించినా, నిర్ణయాలు మాత్రం పూర్తిగా కేసీఆర్ పరిధిలోనే జరిగాయని అన్నారు. ప్రతి నిర్ణయం కేసీఆర్ దేనని హరీష్ రావు పీసీ ఘోష్ కమిషన్కు చెప్పారనే విషయాన్ని కూడా గుర్తుచేశారు. హరీష్ రావుపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి విభేదాలు లేవని. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్ప మరే విషయంలోనూ నాకు ఆయనపై కోపం లేదు అని చెప్పి, తన విమర్శలు పూర్తిగా పరిపాలనా విధానాలకే సంబంధించినవని వివరించారు. కొత్త పార్టీపై కవిత వ్యాఖ్యలు. ఇటీవలి కాలంలో కవిత కొత్త పార్టీ స్థాపనపై చర్చలు ఎక్కువయ్యాయి. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తూ కొత్త పార్టీ పెట్టాలా లేదా అనే అంశంపై నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని చెప్పారు. రాజకీయంగా తన తదుపరి అడుగులపై అన్ని వర్గాల వారితో చర్చలు జరుపుతున్నానని వివరించారు. ఒక వర్గం కోసం కాదు.. ప్రజలందరి కోసం పని చేయాలనుకుంటున్నాను.. బీసీ సమస్య నా మనసుకు దగ్గరైంది.. ప్రస్తుతం ఫ్రీ బర్డ్?ని.. నా ద్వారాలు తెరిచె ఉన్నాయి.. చాలా మంది వచ్చి నన్ను కలుస్తున్నారు.. నాతో టచ్?లో ఉన్న బీఆర్ఎస్ నేతల లిస్ట్ చాలా పెద్దది అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి కేసీఆర్ విధానాన్ని గుర్తు చేశారు. పార్టీ పెట్టేముందు కేసీఆర్ వందల మందితో చర్చలు జరిపారు. ప్రస్తుతం నేనూ అదే చేస్తున్నాను అని చెప్పారు. అంటే త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం కంటే, పరిస్థితులను సమీక్షించి తర్వాతే నిర్ణయం తీసుకుంటానని ఆమె అర్థం చేశారు. కాంగ్రెస్లో చేరే ఆలోచనలేదని స్పష్టం. కవిత మరోసారి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాన్ని పూర్తిగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన నాకు అస్సలు లేదు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. నేనూ కాంగ్రెస్లో ఎవరినీ అప్రోచ్ కాలేదు అని ఆమె స్పష్టంగా చెప్పారు. సస్పెన్షన్ అంశంపై వ్యాఖ్య. తండ్రి పార్టీ నుండి సస్పెండ్ అయిన తన పరిస్థితిని గుర్తుచేసుకుంటూ, తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని నేనే అని అన్నారు. ఈ వ్యాఖ్య ద్వారా కుటుంబ రాజకీయ పరిణామాల్లో తనకు ఎదురైన కష్టాలను గుర్తు చేస్తూనే, ఆ అనుభవం తనను మరింత బలపరిచిందని సూచించారు. రాజకీయ పరిశీలన. కవిత తాజా వ్యాఖ్యలు రాజకీయ రంగంలో.. అనేక ప్రశ్నలను తెచ్చాయి. హరీష్ రావుపై అవినీతి ఆరోపణలు చేయడం ఒకవైపు బీఆర్ఎస్లో ఉన్న పాత విభేదాలను మళ్లీ తెరమీదకు తెచ్చింది. మరోవైపు కొత్త పార్టీ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ఉంచడం, ప్రజలతో, మీడియాతో చర్చల్లో తన ప్రాధాన్యతను నిలుపుకోవడానికి ఒక వ్యూహంగా కనిపిస్తోంది. మొత్తానికి, కవిత వ్యాఖ్యలు ఒక వైపు బీఆర్ఎస్లోని అంతర్గత రాజకీయాలను కదిలిస్తే, మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో తన స్వంత స్థానం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్న సంకేతాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే నెలల్లో ఆమె తీసుకునే నిర్ణయాలు రాజకీయ సమీకరణాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### వైసీపీకి మరో తలనొప్పి

# పరకామణి నుంచి నోట్లు అవుట్

తిరుమల, సెప్టెంబర్ 22, (భారత శక్తి):
తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. భానుప్రకాష్ రెడ్డి, శ్రీవారి హుండీ డబ్బు లెక్కించే విభాగం పరకామణిలో రూ.100 కోట్లకు పైగా దొంగతనం జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 ఏప్రిల్లో జరిగిన ఒక



చిన్న దొంగతనం ద్వారా బయటపడిన ఈ కుంభకోణం, గత వైఎస్ఆర్సీపీ హయాంలో కుట్రగా భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. భానుప్రకాష్ రెడ్డి ఆరోపణల ప్రకారం, 2023 ఏప్రిల్ 29న టీటీడీ విజిలెన్స్ మరియు సెక్యూరిటీ విభాగం సిబ్బంది, పెద్ద జీయర్ మఠంలో క్లర్క్గా పని చేసే సి.వి. రవి కుమార్ను రెడ్హ్యాండ్గా పట్టుకున్నారు. పరకామణి హాల్లో శ్రీవారి హుండీ దానాలు లెక్కించే పనిలో మఠం ప్రతినిధిగా ఉన్న రవి కుమార్, విదేశీ కరెన్సీ 900 డాలర్లు, సుమారు రూ.72,000 ను తన ఇన్నర్ వేర్లో దాచుకుని బయటకు వెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డాడు. వెంటనే తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. మే 30, 2023కి చార్జ్షీట్ ఫైల్ చేశారు. తిరుపతిలోని ఎఏ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో విచారణ జరిగింది.అయితే మే 19, 2023కి రవి కుమార్ చెన్నై, తిరుపతిలోని 7 ప్రధాన ఆస్తులను టీటీడీకి రాసిచ్చారు. వీటి విలువ కోట్లలో ఉంటుంది. ఆ తర్వాత, సెప్టెంబర్ 9, 2023న లోక్ అదాలత్లో రాజీ చేసుకుని కేసు క్లోజ్ అయింది. ఈ ప్రాసెస్ టీటీడీ లా డిపార్ట్మెంట్ ద్వారా కాకుండా, మాజీ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ చేత జరిగింది. తాను పోలీసు అధికారుల ఒత్తిడికి లొంగి ఈ రాజీ చేశానని సతీష్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడు. ఓ చిన్న క్లర్క్ కు కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వస్తాయని దీని వెనుక పెద్ద ముఠా ఉందని భానుప్రకాష్ రెడ్డి అంటున్నారు. రవికుమార్ ఆస్తులు కొన్నింటిని టీటీడీకి రాసిచ్చి.. వందల కోట్ల ఆస్తులు వైసీపీ నేతలు రాయించుకున్నారన్న ఆరోపణలు చేస్తున్నారు. నారా లోకేష్ కూడా ఈ అంశంపై స్పందించారు. అధికారం అండతో జగన్ గ్యాంగ్ శ్రీవారికి చేయని అపచారం లేదు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూని కల్తీ చేశారు. అన్న ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారు. తిరుమల దర్శనాలను అమ్మేసి సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం దుర్లభం చేశారు. ఏడుకొండల జోలికి వెళ్ళవద్దు, శ్రీవారికి అపచారం తలపెట్టవద్దు అని.. నాడు జగన్మోహన్ రెడ్డికి బతిమాలి చెప్పారు చంద్రబాబు గారు.. అయినా వినలేదు. ఏడుకొండలవాడు చాలా పవర్ ఫుల్ సామి.. ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా.. ఏం జరుగుతుందో తెలిసినా జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారని.. నిందితులే పాపాల చిట్టా విప్పబోతున్నారని ప్రకటించారు.

## తాండూరు ఆసుపత్రిలో గర్భిణీ మృతి బంధువుల అందోళన

వికారాబాద్ సెప్టెంబర్ 22 : (భారత శక్తి):
తాండూరు మాతా శిశు ఆసుపత్రిలో గర్భిణీ మృతి చెందింది. దాంతో ఆస్పత్రి ముందు మృతురాలి బంధువులు ఆందోళన కు దిగారు. అఖిల (23)అనే గర్భిణి వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. కొడంగల్ నియోజక వర్గం రావులపల్లి గ్రామానికి చెందిన అఖిల రెండవ ప్రసవం కోసం ఆదివారం అర్ధరాత్రి తాండూర్ లోని మాతా శిశు ఆసుపత్రికి వచ్చారు. అయితే అఖిలను పరీక్షించిన డ్యూటీ డాక్టర్ మంజుల నిర్లక్ష్యం కారణంగా ఒక్కసారిగా బీపీ పెరిగి సోమవారం తెల్లవారుజామున కన్ను మూసింది. ప్రసవం కోసం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఆసుపత్రికి రాగా వైద్యులు పట్టించుకోక పోవడంతో అఖిల మృతి చెందినట్లు , వైద్యుల నిర్లక్ష్యం పై బాధితులు శవం తో ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. బాధితుల ఆందోళనతో దిగివచ్చిన ఆస్పత్రి ఆర్ఎంఓ అనిల్ కుమార్ రెడ్డి బాధితుల ఫిర్యాదు మేరకు డ్యూటీ డాక్టర్ మంజులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.



## డెలివరీ బాయ్ ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శ్రీకాళహస్తి సెప్టెంబర్ 22 : (భారత శక్తి):
రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ముని రెడ్డి (55) శ్రీకాళహస్తిలో గత 12 ఏళ్లుగా నివాసం ఉంటూ ఒకవైపు వ్యవసాయం చేసుకుంటూ మరోవైపు డెలివరీ బాయ్ గా పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు.విధుల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలోని అమర జ్యోతి కళ్యాణమండపం ఎదురుగా రాత్రి 10:50 – 11:00 నిమిషాల సమయంలో ఫుడ్ డెలివరీ ఇవ్వడానికి తన ద్విచక్ర వాహనం లో ఎస్కే ఫుడ్ రెస్టారెంట్ కి క్రాస్ చేసే సమయంలో గూడూరు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో మునిరెడ్డి కి తీవ్ర గాయాలైనాయి.ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు.సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.
========================

## పినపాక ఏజెన్సీలో హైఅలర్ట్

భద్రాద్రి కొత్తగూడెంసెప్టెంబర్ 22: (భారత శక్తి):
పినపాక ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్ కొనసాగుతోంది. మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తం అయ్యాయి. పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా సరిహద్దు అటవీప్రాంతంలో కూంబింగ్ జరుపుతున్నారు. కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో అడవులను జల్లెడ పడుతున్నారు.

# సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు

హైదరాబాద్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
తెలంగాణ రాజకీయాల్లో ఏం జరగబోతోంది? ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతవరకు వచ్చింది? మూడు అడుగులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నచందంగా మారిందా? ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెయ్యబోతోంది? ఈ కేసును సీబీఐకి ఇవ్వనుందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి సీబీఐకి మరో కేసు బదిలీ కానుందా? ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించే యోచనలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై ఇప్పటికే విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించింది సిట్. సీబీఐ రంగంలోకి దిగితే వేగంగా దర్యాప్తు జరగడం ఖాయమని అధికారులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ విచారణ చేయడంతో అధికారులు సహకరించలేదని, అదే సీబీఐ అయితే కచ్చితంగా ఈ కేసు కొలిక్కి వస్తుందని అంటున్నారు. దీనిపై ఈ వారం లేకుంటే వచ్చేవారంలో ప్రభుత్వ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే అప్పటి ప్రభుత్వ పెద్దలకు కష్టాలు తప్పవని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో జడ్జిలు, రాజకీయ నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. చాలామంది సిట్ ముందుకు వచ్చి చెప్పాల్సినవన్నీ చెప్పారు. ఇప్పుడు ఏం చేసినా రాష్ట్ర ప్రభుత్వం కావాలని చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఓపెన్ గా చెబుతున్నారు. అదే సీబీఐకి అప్పగిస్తే ఏ సమస్యా ఉందని కొందరు అధికారుల మాట.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ కేసుని సీబీఐకి అప్పగించవచ్చని అంటున్నారు. అదే జరిగితే తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు చోటు చేసుకోవడం ఖాయం. ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇస్తారనే విషయం తెలియగానే బీఆర్ఎస్ నేతలు అలర్ట్ అయ్యారు. దీనిపై నేతలు అంతర్గతంగా చర్చించుకోవడం మొదలైంది. ఈ కేసులో సీబీఐ దిగితే పార్టీ పనైపోయినట్టేనని అంటున్నారు. రానున్నరోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసుపై ప్రభుత్వం ఎలా అడుగులు వేస్తుందో చూడాలి. తెలంగాణ రాష్ట్రం నుంచి సీబీఐకి మరో కేసు! ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించే యోచనలో తెలంగాణ ప్రభుత్వం. ఈ కేసుపై ఇప్పటికే విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించిన సిట్. కేసుకు సంబంధించి పలువురిని విచారించిన సిట్. ఇప్పటికే కాళేశ్వరం కేసుని సీబీఐకి ప్రభుత్వం అప్పగించింది.



భారత శక్తి



# పాపం..మాజీ డీఎస్పీ నళిని

హైదరాబాద్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ నళిని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. స్వరాష్ట్రం కసం తన ఉద్యోగాన్ని సైతం వదులుకుంది. ఉద్యమంలో పాల్గొన్నందుకు నాటి ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. తాజాగా నళిని ఆరోగ్యానికి సంబంధించిన విషయం అందరినీ షాక్ కు గురిచేసింది. చావు బతుకుల మధ్య నళిని కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో తన అనారోగ్యంపై ఫేస్ బుక్ లో పోస్ట్ చేసింది. తెలుగు రాష్ట్ర ప్రజలకు డీఎస్పీ నళిని బహిరంగ లేఖ ( వీలునామా/ మరణ వాంగ్మూలం)రాసింది.ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవిక గా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నాఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్ గా ఉంది.ప్రస్తుతం క్రిటికల్ పొజిషన్ లో ఉన్నాను. మూడు(3)రోజుల నుండి నిద్ర లేదు. రాత్రంతా మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ గడుపుతున్నాను. ఎనిమిది (8)ఏండ్ల క్రితం సోకిన రుమాటైడ్ ఆర్థ్రైటీస్ అనే విలక్షణ కీళ్ల జబ్బు(= ఃశ్రీనీనీట ఇఃజీనిఇఃవతీ+ ఃనీనివ అజీనిఇఃవతీ) రెండు నెలలుగా టైఫాయిడ్ , డెంగ్యూ, చికెన్ గున్యా వైరస్ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. కనకణం పేలిపోతున్నట్లు, ఏ కీలుకా కీలు విరిచేసినట్లు నొప్పి. తట్టుకోలేక పోతున్నాను.2018 లో ఈ జబ్బు ప్రారంభం అయినప్పుడు ఇలాంటి స్థితి యే ఏర్పడ్డపుడు,మొండి పట్టుదలతో ఏదో సాధించాలనే తపనతో హరిద్వార్ వెళ్ళి రాందేవ్ బాబా పంచకర్మ సెంటర్ లో నెలల తరబడి ఉంటూ నన్ను నేను బాగుచేసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు అంత దూరం పోయేంత ఓపిక లేదు. నిరామయంలో చేరేంత డబ్బు లేదు. 25 ఏండ్ల క్రితమే నా శరీరం నాన్ స్టెరాయిడల్యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ కు సెన్సిటివ్ గా మారిపోయింది. నేను ఫార్మసిస్టు ను కూడా. కాబట్టి అలోపతి మందులకు ఎన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయో నాకు బాగా తెలుసు. కనుక 30 లోపు ఉండాల్సిన ఖీం ఫ్యాక్టర్ అత్యధికంగా 900 కు చేరినా స్టెరాయిడ్స్ వాడకుండా ఆయుర్వేదమే వాడుతూ, యోగ,ధ్యానం, వేదాధ్యయనం, యజ్ఞముల ద్వారా మామూలు మనిషిగా మీ అందరి ముందు కనిపించాను. కానీ గత కొన్ని నెలలుగా మళ్ళీ నాలో స్ట్రెస్ పెరుగుతూ వస్తుంది. దాని ప్రభావమే రకరకాల ఆరోగ్య రుగ్మతలు చుట్టుముట్టాయి. ఇంగ్లీష్ మందులను వాడక తప్పని పరిస్థితి.వాటి సైడ్ ఎఫెక్ట్స్ నా పరిస్థితిని ప్రమాద స్థాయి కి చేర్చాయి.నా గతమంతా వ్యధ భరితం. తెలంగాణ ఉద్యమ పోరాటం వల్ల నా నిలువెల్లా గాయాలే అయ్యాయి. రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహం లోంచి బయట పడితే, డిపార్ట్మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లాన్ని కసితీరా దింపింది. సహాయం చేసేవాడు కనిపించక, నొప్పిని భరిస్తూనే 12 ఏళ్ల అజ్ఞాతవాసాన్ని అనుభవించాను. మహర్షి దయానందుని దయవల్ల ఒక చక్కని ఆధ్యాత్మిక మార్గాన్ని కనుగొని, అందులో విశేషమైన కృషి చేస్తూ, యజ్ఞ బ్రహ్మగా వివైపిఎస్ ( వేద యజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలుగా ఎదిగి, హిందీ అభిమానులను కూడా సంపాదించుకొని,నా దారిని రహదారిగా పూల బాటగా మలచుకున్నాను. నళిని మళ్ళీ వికసించింది.ఇలాంటి తరుణంలో నేటి అఓ అధికారంలోకి రాగానే నా ఫైల్ ను ఎందుకో తెరిచారు. నాకేదో సహాయం చేస్తానని ప్రకటన చేశారు. వారిని కలిసి నా మనసులో మాట చెప్పాను. సస్పెన్షన్



విచారణ చేయించి ఇన్నేండ్లు ఇవ్వకుండా ఎగ్గొట్టిన సబ్సిస్టెన్స్ అల్లోవెన్స్ లెక్కకట్టి( సుమారు 2 కోట్లు) ఇవ్వండి అని అడుగుతూ 16 పేజీల స్వీయ లిఖిత రిపోర్ట్ ను ఇచ్చాను. వీలైతే వేద విద్యా కేంద్ర స్థాపనకు గ్రాంట్ కూడా ఇమ్మని అడిగాను.( రెండోది వారి పార్టీ పాలసీ కి విరుద్ధం. నేను హిందూ కాకపోయి ఉంటే వెంటనే గ్రాంట్ శాంక్షన్ అయి ఉండేది). 6 నెలల తర్వాత నా పిటిషన్ పొజిషన్ కనుక్కుంటే చెత్త బుట్ట పాలైంది అని తెలిసింది. నా ఆఫీస్ కాపీ ని మళ్ళీ స్కాన్ చేసి పంపాను. దానిపై ఇప్పటి వరకు స్పందన లేదు.మీడియా మిత్రులకు విజ్ఞప్తి. నేను చస్తే ఎవరూ సస్పెండెడ్ ఆఫీసర్ అని రాయకండి.రిజైన్డ్ ఆఫీసర్,కవయిత్రి ,యజ్ఞ బ్రహ్మ అని నన్ను సంభోదించండి. నా శరీరానికి జరగాల్సిన అంతిమ సంస్కారం వైదికంగా జరగాలి .

---

# బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి

మహబూబాబాద్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో పండుగపూట విషాదం నెలకొంది. ఎంచగూడెం గ్రామానికి చెందిన మౌనిక(32) బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మరణించింది. ఆదివారం ఉదయం నుంచి ఇద్దరు కూతుర్లు, కొడుకుతో కలిసి ఎంతో ఆనందంగా పూలను తెచ్చి బతుకమ్మ పేర్చింది. సాయంత్రం స్థానికంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పాటలు పాడుతూ కోలాటాలు వేస్తూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.
==============================

# రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

మహబూబ్ నగర్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
మహబూబ్నగర్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టిడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పెద్దమందడి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో హైదరాబాద్కు ప్రయాణిస్తున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న కారును మరో కారు ఢీకొట్టింది.
===================================

# టికెట్ కౌంటర్ లోనే మద్యం తాగిన సిబ్బంది

పెద్దపల్లి సెప్టెంబర్ 22: (భారత శక్తి):
పెద్దపల్లి జిల్లా ఓదెల రైల్వే స్టేషన్లో ఆదివారం సౌత్ సెంట్రల్ రైల్వే సిబ్బంది టికెట్ కౌంటర్లోనే మద్యం తాగుతూ కెమెరాకు చిక్కినట్లు స్థానికులు తెలిపారు. బాధ్యులను పట్టుకోవడానికి ప్రయత్నించినా వారు తప్పించుకున్నారు. ప్లాట్ఫాంలో లైటింగ్ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ చర్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
===========================

# భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త

నల్గొండ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
నల్లగొండ జిల్లా దేవరకొండలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో భర్త తన భార్యను కిరాతకంగా హతమార్చాడు. స్థానిక జంగాల కాలనీకి చెందిన గణేశ్ వంట మాస్టర్గా పని చేస్తున్నాడు. తన భార్య రేణుకతో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. అదే ఆవేశంలో రేణుకను రోకలి బండతో కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.
============================

# ఆర్టీసీ బస్టాండ్ ముందు కారు బీభత్సం


కరీంనగర్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి ఓ కారు వేగంగా వచ్చి ఆంధ్రా బ్యాంక్ ముందున్న కాంక్రీట్ జెర్సీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం జెర్సీలో ఇరుక్కుపోయింది. స్థానికులు కారును బయటకు తీయగా, డ్రైవర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ముందు నుంచి రాంగ్ రూట్లో పరారయ్యాడు.
====================

# బ్లడ్ గ్రూప్ మార్చి రక్తం ఎక్కించిన ఘటనలో రోగి జ్యోతి పరిస్థితి విషమం

వరంగల్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. జ్యోతి అనే రోగికి ఓ ? పాజిటివ్క బదులు బీ పాజిటివ్ బ్లడ్ ఆసుపత్రి సిబ్బంది ఎక్కించారు. దాంతో రోగి పరిస్థితి విషమిస్తుందని, ఆమె ప్రాణాలకు భరోసా ఇవ్వలేమని వైద్యులు చేతులెత్తేసారు. తమ వద్ద ట్రాన్స్ఫ్యూషన్ విభాగం లేదని, జ్యోతిని నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని కుటుంబసభ్యులకు తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, తన భార్యను కాపాడాలని భర్త రాజు వేడుకుంటున్నాడు.కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జ్యోతి తెల్ల, ఎర్ర రక్తకణాలు, ప్లేట్లేట్స్ సంఖ్య తగ్గడంతో ఆసుపత్రిలో చేరింది.

# తొలిరోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి

విజయవాడ సెప్టెంబర్ 22: (భారత శక్తి):



ఇంద్రకీలాద్రి పై అమ్మవారిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ అందరికి దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆధ్యాత్మికత వాతావరణంలో దర్శించుకుంటున్నారని తెలిపారు. పటిష్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారని తెలిపారు. క్యూలైన్లు అన్ని సజావుగా సాగుతున్నాయని .. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రోటోకాల్ దర్శనాలకు ప్రత్యేకంగా స్లాట్లు కేటాయించినట్లు తెలిపారు దాదాపు 4,000 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమిష్టి సహకారంతో రాష్ట్ర పండుగను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రత్యేక అధికారులు కూడా ప్రతి సెక్టార్ లోను విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నచిన్న లోపాలు ఏవైనా ఉంటే వాటిని సరిదిద్దుకొని ముందుకు వెళ్తున్నట్లుమంత్రి వివరించారు
==================================

# రాజన్న ఆలయంలో శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు


వేములవాడ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు వేములవాడ రాజన్న ఆలయంలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని, ఈ తొమ్మిది రోజుల్లో 9 రూపాల్లో శ్రీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. ఆలయం ప్రత్యేకంగా ముస్తాబయింది.

---

# ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

## కూల్చివేతలకు అడ్డుపడతా:ఎమ్మెల్సీ కవిత

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):



గాజుల రామారం లో పేదల ఇల్లు కూల్చివేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం గాజులరామారంలో ఇండ్లు కోల్పోయిన బాధితులను కవిత పరామర్శించారు.
తరువాత ఆమె మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా శని ఆది వారాల్లో కూల్చివేతలు ఏంటని ప్రశ్నించారు. పండగ పూట పేదల జీవితాల్లో చీకట్లు నింపడం ఈ ప్రభుత్వానికి అలవాటు అయింది. మీకు దమ్మంటే అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోండి. కనీసం వారికి ముందస్తు సూచనలు చేయకుండా,చిన్న పిల్లలని చూడకుండా బైటకు పంపి రూములు కూల్చడం హేయమైన చర్య. ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న?వారికి వసతి ఏర్పాటు చేసిన తర్వాత ఆక్రమణలు తొలగించాలని అన్నారు.
ఆరో తారీకు అల్టిమేటం పెట్టారని స్థానికులు చెబుతున్నారు,వారిని రోడ్డున పడేసి కూల్చివేత పనులు చేస్తే ముందు జేసీబీ కి నేనే అడ్డం పడతా. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చాక పేదల రూములు స్వాదీనం చేసుకోవాలి. లేదంటే పేదల పక్షాన జాగృతి తరపున ఉద్యమిస్తాం.అని హెచ్చరించారు..

# మేడిపల్లి పీఎస్ ముందు సాయి తేజ కుటుంబికుల అందోళన

మేడ్చల్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు సాయి తేజ కుటుంబ సభ్యులు అందోళనకు దిగారు. సాయి తేజ ది ఆత్మహత్య కాదు హత్య అంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటనపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సాయి తేజ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
అదిలాబాద్ నుండి ఇంజనీరింగ్ విద్య కోసం హైదరాబాద్ కి కొడుకుని కుటుంబ సభ్యులు పంపించారు. సాయి తేజ కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులు ఘర్షణ పడుతుంటే కాలేజీ యాజమాన్యం ఏం చేస్తుందంటూ మండిపడ్డారు. కాలేజీ యజమానియం పై చర్యలు తీసుకోవాలని సాయి తేజ కుటుంబ సభ్యుల డిమాండ్. సాయి తేజ మృతి పై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

---

# విజయవాడ ఉత్సవ్ సెలబ్రేషన్స్...

## మైలవరంలో "విజయవాడ ఉత్సవ్" పై అవగాహన కార్యక్రమం...

మైలవరం... సెప్టెంబర్ 22: (భారత శక్తి):
ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం, మైలవరం పట్టణంలో విజయవాడ ఉత్సవ్ సెలబ్రేషన్స్ పై అవగాహన కల్పిస్తూ మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, విజయవాడ పార్లమెంట్ మెంబర్ కేశినేని శివనాథ్ ( చిన్ని) పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు..ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ అనేది దేశానికే ఆదర్శమని, ఇటువంటి ప్రతిసాత్మకమైన కార్యక్రమాన్ని మన విజయవాడ ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విషయం అని తెలియజేస్తూ, స్థానిక శాసనసభ్యులు కార్యాలయం వద్ద, పంచాయతీ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద, డౌన్ సెంటర్ వద్ద, ఆల్ఫా సెంటర్ వద్ద డాన్స్ కార్యక్రమం నిర్వహించి, విజయవాడ ఉత్సవ్ సెలబ్రేషన్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# భారీ వర్షానికి పలు కాలనీలు జలమయం

మేడ్చల్ . సెప్టెంబర్ 22: (భారత శక్తి):
ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హయత్ నగర్ మండలంలో మునగనూరు, బంజారా కాలనీలు నీట మునిగాయి. భారీ వర్షానికి కాలనీలు మొత్తం అస్తవ్యస్తంగా మారాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నీట మునిగిన హయత్ నగర్ లోని బంజారాకాలనీ పరిస్థితిని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్,స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జీవన్ రెడ్డి పరిశీలించారు.

---

# కోఠి ఈఎన్టీ లోభారీగా మురుగునీరు....

## ఒకవైపు మురుగు.... మరోవైపు దుర్గంధం

- దుర్వాసనలతో కంపుకొడుతున్న ఆసుపత్రి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యసిబ్బంది

హైదరాబాద్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
రోగులకు వైద్యసేవలు అందించాల్సిన ఈఎన్టీ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు పరుగులు పెడుతుంది. దీంతో మురుగునీటి ద్వారా దుర్వాసనలు ఆసుపత్రి వార్డులకు వ్యాపిస్తుండటంతో రోగులు ముక్కు మూసుకుని చికిత్సలు పొంద ల్సిన దుస్థితి నెలకొంది. ఇక వార్డుల్లో చికిత్సలు పొందుతున్న రోగులకు వైద్యం అందించే వైద్యులు, సిబ్బంది పరిస్థితి సైతం మరింత దారుణంగా మారింది. ముక్కుకు మాస్కులు పెట్టుకుని, దుర్వాసనలు పీలుస్తూనే వైద్యసేవలు అందించాల్సి వస్తుంది. ఇక అత్యవసరంగా ఈఎన్టీ ఆసుపత్రి క్యాజువాల్టీకి వచ్చే రోగుల పరిస్థితి మరీ దారుణం. మురుగు నీటిలోంచి నడుచుకుంటూ వెళ్లాల్సిరావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అవస్థలు పడుతూనే చికిత్సలు చేయించుకుంటున్నారు. అసలే వైద్య నిపుణుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక ఒకవైపు రోగులు అవస్థలు పడుతుంటే... అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఆరోగ్యాన్ని ప్రసాదించాల్సిన ఈఎన్టీ ఆసుపత్రి మురుగుతో దుర్గంధంగా మారి, తమ వారికి ఎక్కడ కొత్త రోగాలను అంటగడుతుందోనని రోగి సహాయకులు భయాందోళనలకు గురవుతున్నారు.
పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు....
ఈఎన్టి ఆసుపత్రి ప్రాంగణంలో నాలా డ్రైనేజీ పొంగిపొర్లుతూ ,ఏరులై ప్రవహిస్తున్నా జిహెచ్ఎంసి అధికారులు తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆసుపత్రి ప్రాంగణమంతా దుర్వాసనలు వెదజల్లుతూ రోగులు, వారి సహాయకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచర్య తెలిపారు. ఆసుపత్రి దుర్గంధంగా మారినప్పటికీ పాలక వర్గం పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నరూ. ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆసుపత్రిగా ఖ్యాతిగాంచిన కోఠిలోని ప్రభుత్వ చెవి, గొంతు, ముక్కు (ఈఎన్టీ) ఆసుపత్రిలో వైద్యం కోసం ముక్కు మూసుకుని చికిత్సలు చేయించుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని చెప్పారు. రెండు వరాల నుండి ఈఎన్టీ ఆసుపత్రి ప్రాంగణంలో డ్రైనేజీ పొంగి పొర్లుతూ ఆసుపత్రి క్యాంటీన్ నుంచి మెయిన్ గేటు మీదుగా క్యాజువాల్టీ వరకు మురుగునీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆసుపత్రి ప్రాంగణమంతా దుర్గంధ పూరితంగా మారి, కంపు కొడుతుందన్నారు. నెల రోజుల నుంచి సంబంధిత అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని సూపరింటెండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కమిషనర్ కు హైడ్రా కమిషనర్ కు డిఎంఈకి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగు సమస్య పరిష్కరించాలని కోరారు. వార్డుల్లోకి దుర్వాసన వ్యాపిస్తుండటంతో భోజనం కూడా చేయాలని అనిపించడం లేదని రోగి సహాయకులు వాపోతు న్నారు. దుర్వాసనలు భరించలేక పోతున్నామని, ఇంత జరుగుతున్నా ఆసుపత్రి పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని పలువురు రోగులు, రోగి సహాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# పెద్ద చెరువులో వ్యక్తి ఆత్మహత్య

సంగారెడ్డి సెప్టెంబర్ 22: (భారత శక్తి):
అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోనీ పెద్ద చెరువులో నిన్న గల్లంతైన వ్యక్తి మృతి దేహం లభ్యం అయింది. చెప్పులు, మొబైల్ ఫోన్, తన ఆత్మహత్యకు కారణాలు లెటర్ వ్రాసి చెరువు మెట్ల పై వదిలిన వ్యక్తిఆత్మహత్య చేసుకున్నాడు. చెరువులో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి హఫీజ్ పేట్ - ఆదిత్యనగర్ కాలనీ కి చెందిన భశరతుల్లా ఖాన్ ( 28) గా పోలీసులు గుర్తించారు. తన భార్య (కలకత్తా కు చెందిన మహిళా) పై అనుమానం తో పలు సార్లు గొడవ పడినట్లు మాధాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యాయి.భార్య, భర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలతో భార్యను చితక బాదిన కేసు లో జైలు శిక్ష అనుభవించి భశరతుల్లా ఖాన్ విడుదల అయ్యాడు.మృతదేహం కోసం చెరువులో గాలిస్తుండగా ఈరోజు ఉదయం 9 గంటలకు మృతదేహం లభ్యమైనది.మృతి దేహాన్ని ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు వెలికి తీశారు.అమీన్ పూర్ ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అన్ని హంగులతో రాజీవ్ పార్క్ సుందరీకరిస్తాం

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

- పార్క్ అభివృద్ధికి మూడు కోట్ల నిధులు మంజూరు
- కన్సల్టెన్సీ డిజైన్ అండ్ ఆర్కిటెక్ట్ ప్రతినిధులతో రాజీవ్ పార్కు పరిశీలించిన నిర్మలజగ్గారెడ్డి దంపతులు
- వచ్చే నెలలో సీఎం ప్రారంభించే దిశగా చర్యలు

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 22:
పట్టణంలోని రాజీవ్ పార్క్ ను అన్ని హంగులతో సుందరీకరించి



త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సోమవారం రాజీవ్ పార్క్ ను టి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల, డిజైన్ అండ్ ఆర్కిటెక్ట్, కన్సల్టేషన్ ప్రతినిధులతో పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... 2004 సంవత్సరంలో ఎమ్మెల్యే అయిన తర్వాత 2005లో బొబ్బిలి కుంటను ఆనుకొని ఉన్న స్థలంలో రాజీవ్ పార్కును ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. నాటి ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిల హయాంలో పార్క్ పనులు పూర్తయినట్లు తెలిపారు. సమైక్య రాష్ట్రంలో పదేళ్లపాటు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు సైతం మ్యూజికల్ ఫౌంటెంట్ చిల్డ్రన్ పార్క్ ప్లే ఏరియా వసతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక 2014 నుంచి 2018 వరకు పార్కు నిర్వహణ కుంటుపడుతూ వచ్చిందన్నారు. పార్క్ నిర్వాహణపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేకపోవడం, తాను కూడా ఎమ్మెల్యేగా లేకపోవడంతో అభివృద్ధికి దూరమైందన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి మార్గం వేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగేందుకు ప్రోటోకాల్ ఉండాలి అని తలచిన సీఎం రేవంత్ రెడ్డి తన భార్య నిర్మలకు కార్పొరేషన్ పదవిని ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇక ఈ మధ్యకాలంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవిని కలిసి పార్క్ అభివృద్ధి విషయాలు చర్చించినట్లు తెలిపారు. రాజీవ్ పార్క్ సుందరీ కర్ణకు 15 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. తక్షణ పనుల నిమిత్తం మూడు కోట్లు ఇస్తానని హామీ ఇవ్వడంతో తగ్గట్టుగా ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు తెలిపారు. దీంతో మంజూరైన మూడు కోట్లతో కన్సల్టెంట్ ఆర్కిటెక్ట్ తదితర అభివృద్ధి పనులను ప్రతినిధులకు సూచించడం జరిగిందన్నారు. పార్కులో పెరిగిన పిచ్చి గడ్డిని తొలగించి ల్యాండ్ స్కేప్ పనులు చేపట్టాలని సూచించారు. ఉన్న చెట్లను తొలగించకుండా పనులు నిర్వహించాలన్నారు. కొత్త గ్రాస్ చిల్డ్రన్ పార్క్ లేటెస్ట్ సౌకర్యాలను కల్పించేలా చూడాలన్నారు. నేలపై టైల్స్ కాకుండా మందంగా ఉన్న తాండూర్ బండలు వేసి షో కోసం కాకుండా మన్నిక ఉండేలా చూడాలన్నారు. ఇక లైటింగ్ కూడా షో కోసం కాకుండా నాణ్యమైన వాటిని ఏర్పాటు చేయాలన్నారు. పార్కులో అధిక వెలుతురు ఉండేలా హైమాస్టలైట్లు దగ్గరగా ఏర్పాటు చేసేలా సూచించారు. మరి ముఖ్యంగా హై వోల్టేజ్ ఉన్న లైట్ లనే వాడాలన్నారు. ఇక వర్షం నీరు పార్కులో నిలవకుండా వెంటనే బయటకు వెళ్లేలా పరిష్కారం మార్గాలను చూడాలన్నారు. చిల్డ్రన్ పార్క్ లో ఒక ఫీట్ మేర ఫైన్ సౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంట్రన్స్ వద్ద రౌండ్ ఫౌంటెన్ ఉండాలని అవి కూడా మన్నికైనవే అధునాతనమైన లైటింగ్ తో ఏర్పాటు చేయాలని ప్రతినిధులకు జగ్గారెడ్డి సూచించారు. మ్యూజికల్ ఫౌంటెన్ సైతం ఇప్పుడున్న లేటెస్ట్ డిజైన్ వాడాలన్నారు. పురుషులు మహిళలకు వేరువేరుగా ఆరు వాష్రూమ్లను ఏర్పాటు చేయాలన్నారు. రాజు పార్కు చుట్టూ 10 ఫీట్ల మేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కుకు కొత్త ఆర్చి ఏర్పాటు చేయాలన్నారు. జిమ్ పరికరాలను సైతం ఏర్పాటు చేయాలని పేర్మినెంట్గా ఉండేలా చూడాలన్నారు. వాచ్ మెన్ రూమ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. పార్క్ లో సేన తీరేందుకు లేటెస్ట్ స్టోన్ పెంచ్ అమర్చాలన్నారు. కొత్తగా 160 కె.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎలక్ట్రిసిటీ అధికారులకు సూచించారు. అక్టోబర్ నెలలో పార్క్ సుందరీకరణ పనులను పూర్తి చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఇదే నెలలో 25వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు పార్కు నిర్వహణ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపాదికన రాత్రింబవళ్లు పూర్తిచేసేలా చూడాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ ఇన్చార్జి మంత్రి వివేకలు హాజరవుతారన్నారు. రాజీవ్ పార్క్ అందుబాటులో లేకపోవడంతో సరైన సౌకర్యాలు లేక నిర్వహణకు దూరమైందన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలతో పార్కును అందుబాటులోకి తెస్తామన్నారు. పిల్లలు ఉత్సాహంగా పార్కులో ఉండేలా పార్కులో ఫౌంటెన్ సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకు వర్క్ మోడ్లో ఉండేలా చూడాలన్నారు. పాత మ్యూజికల్ ఫౌంటెన్ స్థానంలో కొత్త దానిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 30న ఆర్కిటెక్ట్ డిజైన్ ఫైనల్ చేసేందుకు హైదరాబాద్లో కన్సల్టెంట్ కార్యాలయంలో సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ సారి నవరాత్రి మరింత స్పెషల్ : మోదీ

ఈ సారి నవరాత్రి మరింత స్పెషల్: మోదీభారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన ఎక్స్ ఖాతాలో 'ఈసారి ఈ పవిత్రమైన నవరాత్రి సందర్భం చాలా ప్రత్యేకమైనది. ఇక నుంచి దేశంలో కొత్త చరిత్ర మొదలు కాబోతుంది. జీఎస్టీ సంస్కరణలో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉండబోతుంది. మోడీ చెప్పారు. రాష్ట్రాలన్ని అభివృద్ధిలో దూసుకుపోతాయి' అంటూ ట్వీట్ చేశారు.

==============================

# విశాఖ మెట్రో టెండర్లకు వచ్చే నెల 10 వరకు గడువు

విజయవాడ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
విశాఖ మెట్రో టెండర్లకు వచ్చే నెల 10 వరకు, విజయవాడ మెట్రో టెండర్లకు వచ్చే నెల 14 వరకు గడువుందని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి వెల్లడించారు. టెండర్లలో జాయింట్ వెంచర్ను అవకాశం ఇచ్చాం. మూడు కంపెనీలు కలిసి జేవీగా టెండర్లు వేసుకోవచ్చు. కాంట్రాక్ట్ సంస్థల వినతి మేరకు నిర్ణయం తీసుకున్నాం. దీనివల్ల ఎక్కువ కంపెనీలు టెండర్లలో పాల్గొంటాయి. రెండు ప్రాజెక్టులను తక్కువ సమయంలో పూర్తి చేసి, నిర్మాణ వ్యయం తగ్గించాలనేదే మా ఉద్దేశమని అయన అన్నారు.

============================

# శ్రీవారికి కోటీ 80 లక్షల విలువైన బంగారు పతకాలు విరాళం

తిరుమల సెప్టెంబర్ 22: (భారత శక్తి):
తిరుమల శ్రీవారికి కోటి 80 లక్షల విలువైన బంగారు పతకాలు విరాళంగా అందాయి. గోకర్ణకు చెందిన శ్రీమద్ విద్యాధీశ తీర్థ స్వామిజీ... గోకర్ణ పర్తగాలి మఠం తరపున 15 బంగారు పతకాలు, రెండు వెండి పళ్లాలను విరాళంగా అందజేశారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో విరాళంను ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు

========================

# విద్యార్థుల ర్యాగింగ్? ఒక విద్యార్థి ఆత్మహత్య

మేడ్చల్ సెప్టెంబర్ 22:
(భారత శక్తి):



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ లో ర్యాగింగ్ భూతానికి ఇంజనీరింగ్ విద్యార్థి జాదవ్ సాయి తేజ బలి అయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కు చెందిన సాయి తేజ పోచారం మున్సిపాలిటీ పరిధి లో ఉన్నా సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీ లో మొదటి సంవత్సరం చదువుతున్నడు కాలేజీ లో సీనియర్స్ ఆయన తో గొడవ పడి కొట్టారు. స్థానిక యువకులతో కలిసి మళ్ళీ కొట్టి, మీకు ఫైన్ వేయాలి అంటూ బార్ కు తీసుకొని వెళ్లి 15 వేలు బిల్ చేసి ఇంకా కావాలి అంటూ టార్చర్ పెట్టారు. మేము పేద వాళ్ళం మా దగ్గర డబ్బులు లేవన్న వినకుండా టార్చర్ చేసారని ఆరోపణ. దాంతో సాయి హాస్టల్ కు వచ్చి వాళ్ల నాన్న కు వీడియో పంపి ఊరి వేసుకొని చనిపోయాడు

# తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం చైర్ పర్సన్ గా కొత్త శ్రీప్రియ నియామకం




ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్22:
వరంగల్ జిల్లా లోని ఎరువుల నియంత్రణ ప్రయోగశాలలో వ్యవసాయ అధికారిణిగా పనిచేస్తున్న కొత్త శ్రీప్రియను తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం చైర్ పర్సన్ గా హైదరాబాద్ నాంపల్లి లోని ఆ సంఘ భవనంలో ఆదివారం జరిగినసమావేశంలో నియామకఉత్తర్వులు అందజేశారు. గతంలో వరంగల్ జిల్లాలో ఉమెన్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గా నియామకం పొందిన కొత్త శ్రీప్రియ మాట్లాడుతూ నాపై నమ్మకంతో చైర్ పర్సన్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# సమాచార హక్కు చట్టం అక్కర్లేదా.. అధికారులకు ఇంత నిర్లక్ష్యమా..!

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22 (భారత శక్తి) : ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా ఖజానా కార్యాలయం లోని సమాచార హక్కు చట్టం నేమ్ బోర్డును కింద పడేశారు. సమాచార హక్కు చట్టం అంటే అక్కర్లేదా.. అన్నట్లుగా ప్రభుత్వ అధికారులా నిర్లక్ష్యానికి నిదర్శనం.




ప్రభుత్వకార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు, సామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్ళినా పనిచేయించుకోవటం, తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 12 అక్టోబర్ 2005 తేదీన ఈ సమాచార హక్కు చట్టం ఆక్ట్ %౪10% భారతదేశమంతటా అమలులోకి వచ్చింది. దీనిని ఉపయోగించుకొని, ప్రభుత్వ పనులపై సమాచారాన్ని పొందవచ్చు. ఈ సౌకర్యాన్ని, ఈ చట్టం ద్వారా ప్రజలందరికి కలిగింది. ప్రభుత్వ అధికారులు అడగకపోయినా వారంతట వారే విధి విధానాలు, ఉద్యోగుల బాధ్యతలు మొదలైన 17 అంశాల గురించి సమాచారం ఇవ్వాలి. దీని ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి, పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను, ప్రజలకు కనిపించే విధంగా బోర్డుమీద స్పష్టంగా రాసి ఉంచాలి.

## సామాజిక అవగాహన కార్యక్రమంలో

# పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు

కరీంనగర్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
స్థానిక కరీంనగర్లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు గత శనివారం నిర్వహించిన వ్యర్థాలపై అవగాహన కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలుష్యాన్ని నివారించడం, సహజ వనరులను పరిరక్షించడం నగరంలో వాతావరణ మార్పులను తగ్గించడం ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యావరణాన్ని కాపాడటానికి వ్యర్థాల నిర్వహణ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన తీసుకురావడం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం యొక్క ప్రధాన లక్ష్యాలు. పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణ లో ఆరు భాగాలుగా అంటే చెత్తను తగ్గించడం, మరమ్మతు చేయడం, పునర్వినియోగం చేయడం, రీసైకిల్ చేయడం కుళ్ళిపోవడంపై కూడా దృష్టి సారించారు. ఈవ్యర్థాలు, పొడి వ్యర్థాలు, తడి వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు రసాయన వ్యర్థాలు వంటి వివిధ రకాల వ్యర్థాలను గుర్తించడం వర్గీకరించడం వాటిలోని పారవేసే వ్యవస్థ. లలిత్ మోహన్ సాహు మార్గదర్శకత్వంలో, 9వ తరగతి విద్యార్థులు జి. అదితి, ఎస్. సాన్విక,




మిహా ముబారక్, వి. అమోగ్ సాయి ఎస్. జయకృష్ణ వ్యర్థాల నిర్వహణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక అవగాహనను తీసుకువచ్చారు. నగరంలో రైల్వేస్టేషన్ , బస్ స్టేషన్ , ఆసుపత్రి వంటి వివిధ ప్రదేశాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రశ్మిత, హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్ర పాత్రో, భవాని, నిఖిత లు పాల్గొన్నారు.

# సంఘవికాసంతోనే దేశాభివృద్ధి

## విశ్వ శాంతికి భారతీయ విలువలే ఆధారం ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ రమణాచారి.

కరీంనగర్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
సంఘవికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. కరీంనగర్లోని స్థానిక శిశు మందిర్ లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకులలో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్ఎస్ఎస్ శాఖలో నిర్మాణం జరుగుతుందని వివరించారు. 1925 నుండి సంఘ శాఖల ద్వారా వ్యక్తి నిర్మాణము జరుగుతుందని



ఆయన తెలిపారు. శరీరంలోని ప్రతి కణం శరీర ధారుఢ్యానికి ఏ విధంగా పనిచేస్తాయో, దేశంలోని సామాన్య వ్యక్తులు కూడా దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు. భారతదేశ పరమ వైభవం ద్వారానే విశ్వ కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని చెప్పారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాలలో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గొల్లపూడి ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత



విజయవాడ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
విజయవాడ ఉత్సవ్ లో భాగరా ఏర్పాటు చేసిన గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రారంభం అయింది. ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్ ను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసాం. విజయవాడ ఉత్సవ్ లో గొల్లపూడి ఎగ్జిబిషన్ ఒక భాగం. ×వినోదానికి, విజ్ఞానానికి గొల్లపూడి ఎగ్జిబిషన్ వేదిక కానుందని అన్నారు.

==============================

# గవర్నర్ ను ఆహ్వానించిన ఎంపి చిన్ని




విజయవాడ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
విజయవాడ సూర్యారావుపేట లోని రాజ్ భవన్ లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ను ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులతో పాటు మర్యాద పూర్వకంగా కలిసారు. విజయవాడ ఉత్సవ్ కు హాజరుకావాలని విజ్ఞప్తి చేస్తూ ఆహ్వాన పత్రిక అందజేసారు.
భవిష్యత్తులో విజయవాడ నగరాన్ని గ్లోబల్ హబ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు గవర్నర్ కు వివరించారు ఎంపీ శివనాథ్.
నగరంలో నాలుగు ప్రధాన వేదికలపై ఆధ్యాత్మిక వాతావరణం, సంప్రదాయ కళలు, ఆధునిక సంగీతం, వినోదం ద్వారా భక్తులు, నగరవాసులకు అద్భుత అనుభూతి పంచేందుకు వీలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గవర్నర్ కు తెలిపారు. నగరానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు భవిష్యత్తులో కూడా విజయవాడ ఉత్సవ్ కొనసాగిస్తామని గవర్నర్ కు తెలిపారు.

===========================

# కవితకు కేసీఆర్ పిలుపు..?

హైదరాబాద్ సెప్టెంబర్ 22: (భారత శక్తి):
తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా కల్వకుంట్ల కవిత



వ్యవహారం హాట్ టాపిక్ అయింది. భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత, చోటు చేసుకున్న పరిణామాలు ఆ పార్టీ అధినేత కేసిఆర్ ను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో విపక్షాలను నానా ఇబ్బందులు పెట్టిన బిఆర్ఎస్, ఇప్పుడు కుటుంబ సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కవితను శాంతింప చేయాలని కేసిఆర్ ఎన్నిసార్లు ప్రయత్నాలు చేసినా సరే లాభం లేకుండా పోయింది. నేరుగా మాజీ మంత్రి హరీష్ రావు ను లక్ష్యంగా చేసుకుని కవిత విమర్శలు చేశారు. దీనితో కవితను కేసీఆర్ సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఇప్పుడు కవిత జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందంటూ కూడా ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి అప్రమత్తమైంది. కవిత పోటీ చేస్తే ఖచ్చితంగా తమ పార్టీ ఓట్లు చీలుతాయి అనే భావనలో ఆ పార్టీ అధిష్టానం ఉంది. తెలంగాణ జాగృతి నుంచి కవిత మాజీ ఎమ్మెల్సీ అలీ ఖాన్ ను పోటీలో నిలబెట్టే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్నాయి. దీనితో మాజీ సీఎం కేసీఆర్ కవితను ఎర్రవల్లి ఫామ్ హౌస్ కు పిలిచినట్లు సమాచారం. ఆమెతో చర్చలు జరపాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. కవితను పోటీ నుంచి తప్పిస్తే తమకు ఎటువంటి ఇబ్బంది ఉండదు అనే భావనలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. ఒకవేళ కవిత పోటీ చేస్తే పార్టీ ఓట్లు చీలడమే కాకుండా అది అధికార పార్టీకి లాభం చేసే అవకాశం ఉండవచ్చు అంటూ రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కవితకు పడటం సంగతి పక్కనపెడితే, బీఆర్ఎస్ ఓట్లు మాత్రం కవితకు కొంత పడే అవకాశాలు జూబ్లీహిల్స్ లో ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో కవితతో కేసీఆర్ చర్చలు జరిపి, ఆమెను శాంతింప చేస్తారంటూ కూడా ప్రచారం జరుగుతోంది. కవితతో కేటీఆర్ మాట్లాడే ప్రయత్నం చేసిన లాభం లేకుండా పోయిందని, అందుకే కేసిఆర్ నేరుగా రంగంలోకి దిగారు అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. ఇక బీహార్ అసెంబ్లీ ఎన్నికల తో పాటుగా ఉప ఎన్నికలు జరిగే అవకాశం కనబడుతోంది. నవంబర్ లేదా డిసెంబర్ లో ఎన్నికలను నిర్వహించనుంది కేంద్ర ఎన్నికల సంఘం.

# పేరుకే మెనూ - పెట్టింది తిను

- బోనకల్ బీసీ గురుకుల ప్రిన్సిపాల్ నిర్వాహకం పై చర్యలు తీసుకోవాలి..
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఆర్ఓ కి వినతి



ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ), సెప్టెంబర్ 22:పేరుకే మెనూ పెట్టింది...తిను అంటూ వ్యవహారిస్తున్న బోనకల్ బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం లోని పరిష్కృతిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో డి ఆర్ వో కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ బోనకల్ బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, సక్రమమైన మెనూ అందించకుండా ప్రభుత్వం పేరుకే మెనూ అందిస్తుందని నేను పెట్టిందే తినాలని విద్యార్థులను హుకుం జారీ చేయడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గురుకుల పాఠశాలలో సమస్యలు విలేయతాండం చేస్తున్న ప్రిన్సిపాల్ మాత్రం పట్టి పట్టినట్లుగా ఎవరిస్తుందని లక్ష్మణ్ అన్నారు ఇటీవల బీసీ గురుకుల లో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం బీసీ గురుకులానికి వెళ్లగా ఇక్కడ మీకేంటి పనిని ప్రిన్సిపాల్ జ్యోతిర్మయ్ తోపాటు సిబ్బంది విద్యార్థి నాయకులు పట్ల దురుసుగా వ్యవహరించారని ఇదే విషయంపై జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లిన ఇటువంటి స్పందన లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బోనకల్ బీసీ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ ని తక్షణమే సస్పెండ్ చేయాలని అదేవిధంగా పై అధికారులు గురుకులాలను విధిగా తనిఖీ చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగుల్ మీరా మధు శివ వంశీ సురేష జిల్లా నాయకులు నరేందర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కాళోజి కళాక్షేత్రంలో చాకలి ఐలమ్మ చరిత్ర నృత్య నాటకం



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్22:
హన్మకొండ బాలసముద్రం లోని కాళోజి కళాక్షేత్రంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య నాటకోత్సవాలు ప్రారంభమైనవి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , జూపల్లి కృష్ణారావు , ధనసరి అనసూయ , కొండా సురేఖ , ఎం.పి కడియం కావ్య , ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ , మేయర్ గుండు సుధారాణి సహచర ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర నృత్య రూపం ఎంతగానో అలరించింది. అకాడమీ ఛైర్ పర్సన్ పుంజాల అలేఖ్య పోషించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పాత్ర అద్భుతం.ఆనాటి నియంతృత్వ , దోపిడీ, పెత్తందారుల ఆగడాలను కళాబృందం ఎంతో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించిన తీరు అభినందనీయం. ఈ సందర్భంగా నృత్య రూపకం ప్రదర్శించిన కళాకారులను సత్కరించడం జరిగింది...

చారిత్రాత్మక శ్రీ వేయి సంభాల దేవాలయంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో ముఖ్య అతిథి లతో ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలలో సాంప్రదాయ బతుకమ్మ పాటలతో మహిళలు ఆడిపాడి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక, మహిళల ఆత్మగౌరవానికి ప్రతిరూపమని, ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు....

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ తొమ్మిది రోజులు ఆట పాటలతో వైభవంగా సాగే బతుకమ్మ.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే నాగరాజు గౌరమ్మ తల్లిని ప్రార్థించారు....ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి పలు కార్పోరేషన్ ఛైర్మన్లు మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించిన ముఖ్య మంత్రి




కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 22: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసులు పరిష్కార ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లును ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు, ఆర్ అండ్ బి కార్యదర్శి వికాస్ రాజ్ లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనులు వేగవంతం చేయుటపై ముఖ్యమంత్రి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం చేశారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ , అటవీ శాఖ అధికారి నికిత, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ విక్టర్,ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లాభసాటి పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించాలి - మంత్రి తుమ్మల



ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ), సెప్టెంబర్ 22:
గుడిసెల్లో ఉండే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరురఘునాథపాలెం మండలం లచ్చిరాం తాండ లో పర్యటించి వంతెన, రోడ్డు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మలలాభసాటి పంటలైన ఆయిల్ పామ్ పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించాలనిరాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.రఘునాథపాలెం మండలం లచ్చిరాం తండా గ్రామంలో సోమవారం మంత్రి పర్యటించి, 2.15 కోట్ల రూపాయలతో లచ్చిరాం తాండ నుండి ఈర్లపూడి వరకు బీటీ రోడ్డు మరమ్మత్తు నిర్మాణం, 80 లక్షల రూపాయలతో లచ్చిరాం తండా నుండి దోనబండ మధ్య వంతెన నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పామాయిల్, వక్క వంటి పంటలు సాగు చేసుకోవాలని వీటికి మిర్చి, పత్తి, కూరగాయలు వంటి అంతర పంటలు వేసుకోవచ్చని అన్నారు. పామాయిల్ సాగు చేస్తే ఎకరానికి 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మొక్కలకు, అంతర్ పంటలకు, డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తామని అన్నారు. పామాయిల్ పంట సాగు చేస్తే ఎకరానికి 2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉంటుందని అన్నారు. వేసవి కాలంలో కూడా రఘునాథపాలెం మండలంలో చెరువుల నింపే బాధ్యత తీసుకుంటానని, మంచి లాభ సాటి పంటలు రైతులు సాగు చేయాలని మంత్రి అన్నారు.

గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, రెండో విడతలో రేకుల ఇండ్లలో ఉంటున్న వారికి, మూడవ విడతలో ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు, ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు.

గ్రామంలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కు అవకాశాలు పరిశీలించాలని మంత్రి విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మట్టి కి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకుంటూ, ఆర్వోఏఫార్ పట్టాలు పొందిన వారిని అధికారులు ఇబ్బంది పెట్టొదన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పామాయిల్ సాగులో ఖమ్మం జిల్లాను ముందంజలో ఉంచేందుకు నిరంతరాయంగా మంత్రివర్యులు కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రి, రైతులకు చేస్తున్న మార్గదర్శనంను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఆర్ ఇఇ మహేష్ బాబు, విద్యుత్ శాఖ డిఇ రామారావు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్మాత లీలా వైభవ సంకేతాలు దేవి శరన్నవరాత్రులు : చౌదూరి నరసింహా రావు



హైదరాబాద్, (భారత శక్తి) సెప్టెంబర్ 22 :
దేవి శరన్నవరాత్రులలో ఆ జగన్మాత నవ విధ కళలతో మిళితమైన వైవిధ్యభరితమైన రీతిలో ఈ విశేషమైన పుణ్య దినాల్లో ప్రత్యేక పూజలు అందుకుంటుందని ప్రముఖ ప్రవచన కర్త చౌదూరి నరసింహా రావు అన్నారు. ఆ జగన్మాత శైలపుత్రిగా, బ్రహ్మచారిణిగా, చంద్రఘంటగా, కుష్మాండగా, స్కందమాతగా, కాత్యాయనిగా, కాళరాత్రిగా, మహా గౌరీగా, సిద్ధిరాత్రిగా ఇలా నవ అవతారాల్లో, నవ అలంకారాల్లో సర్వాలంకార శోభితురాలై అశేష భక్తులతో విశేషమైన పూజలు అందుకుంటుందని, ఆ దేవి లీలా వైభవానికి ఈ శరన్నవరాత్రులు ప్రత్యక్ష సంకేతాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ ఏడాదికా ఏడాది రిందా రెసిడెన్సి లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయని చౌదూరి నరసింహా రావు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

విశ్వావసు నాము దేవి శరన్నవరాత్రులు ప్రారంభం సందర్భంగా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం నాడు హైదరాబాద్ సమతాపురి కాలనీలోని రిందా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్ మెంట్ లో రిందా రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన దసరా నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని ఆయన ప్రసంగించారు.

తొలుత రిందా అసోసియేషన్ సభ్యులు నాలుగు కుటుంబాల వారు అమ్మవారి తొలిరోజు పూజలు చేశారు. పురోహితుడు శివ స్వామి వారి చేత శాస్త్రోక్తముగా పూజ జరిపించారు. రిందా రెసిడెన్సీ వాసులు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తొలిరోజు అమ్మవారి పూజ లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అర్చించారు. ఇంకా అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, సభ్యులు, మహిళా వలంటీర్లు అందరూ విశేష సంఖ్యలో అమ్మవారి తొలిరోజు పూజలో పాల్గొన్నారు.అనంతరం అందరికీ ప్రసాద వితరణ జరిగింది. తొమ్మిది రోజులపాటు రిందా రెసిడెన్సీలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని, ఈ సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు.

# జాతీయ రహదారుల నిర్మాణాలు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకం.. సి ఏం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ( భారత శక్తి ) సెప్టెంబర్ 22:




సోమవారం హైదరాబాద్ నుండి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి ముఖ్యమంత్రి, జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ సమస్యలు, పెండింగ్ మ్యుటేషన్, ఫారెస్ట్ క్లియరెన్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేషనల్ హైవేస్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మాణాలతో రవాణా సౌకర్యాల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాలు పురోగమిస్తాయని తెలిపారు. రహదారుల నిర్మాణాలు జరుగుతున్న జిల్లాల్లో భూసేకరణ, మ్యుటేషన్, అటవీ అనుమతుల ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన రహదారులతో పాటు, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలన్నారు. ఎటువంటి కారణాలతోనూ రోడ్ల నిర్మాణంలో ఆటంకాలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు.

అనంతరం జిల్లాల వారీగా భూసేకరణ స్థితిగతులను ముఖ్యమంత్రి చర్చించారు. భూసేకరణ సమస్యలు, న్యాయపరమైన ఇబ్బందులు, పరిహారం చెల్లింపులు, రికార్డుల అప్‌డేషన్ వంటి అంశాలపై కలెక్టర్లు వివరాలు సమర్పించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు

(సెప్టెంబర్ 22 ప్రపంచ గులాబీ దినోత్సవం క్యాన్సర్ వ్యాధి సోకినవారికి జీవితం మీద ఆశలు కల్పిస్తూ వ్యాధి గ్రస్తుల్లో మనోధైర్యం నింపేందుకు ఐరాస ఈదినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా రాసిన కవిత)

ప్రపంచ మానవాళి
క్యాన్సర్ మహమ్మారికి
గురైమృత్యువాత
పడుతుంది

ఆధునిక జీవన శైలి
క్రమ రహిత ఆహారపు
అలవాట్లు
జంక్ ఫుడ్ వినియోగం
కాలుష్యం తో
క్యాన్సర్ కేసులు
విజృంభిస్తున్నాయి

చిన్న పెద్ద పేద ధనిక
పల్లెలు పట్నాలు
తేడా లేకుండా క్యాన్సర్
సునామీ ప్రమాద
ఘంటికలు మోగిస్తుంది

క్యాన్సర్ మనసును
శరీరాన్ని ఆత్మను
దెబ్బతీస్తుంది
క్యాన్సర్ సోకిన
వ్యక్తికి ఆర్థికంగా
తట్టుకునే శక్తి
యుక్తులను నేర్పాలి

వ్యాధి నిర్ధారణ
నివారణ చికిత్సపై
అవగాహన
పెంచాలి
ఆత్మనిర్భరతతో
ఆత్మస్థైర్యం
అందించాలి

కుటుంబం సమాజం
వైద్యులు క్యాన్సర్
రోగులకు ప్రతి
దశలో జయిస్తాను
అనే మనో నిబ్బరం
కలిగించాలి

సకాలంలో సరైన
కౌన్సెలింగ్ తో
రోగి మనసు
శరీరం ఆత్మ కోలుకునే
సలహాలు సూచనలు
నేర్పరితనం వున్న
వైద్యులు అవగాహనే
అసలైన ఆయుధం

రోగిలో చికిత్స అవగాహన
ఆధునిక వైద్య పరిజ్ఞానం
చికిత్సా సామర్థ్యం
సమాచార ప్రసార
నైపుణ్య ప్రతిభ
సామర్థ్యాలు వున్న
వైద్యుల సేవలతో
క్యాన్సర్ పై పోరాడే
ఆత్మబలం పెంచాలి

వాడుక భాషలో
చికిత్స పద్ధతులను
బోధించాలి
క్యాన్సర్ రోగికి
సహాను భూతి
కారుణ్య భావనతో
వైద్య సేవలు
అందించాలి

పొగాకు మద్యపానం
గుట్కా ఖైనీ
ధూమపానం
అల్కాహాలు వద్దు
సమతుల
ఆహారమే ముద్దు
నిత్య వ్యాయామం
నడక యోగ ధ్యానం
సరైన జీవన శైలియే హద్దు

ప్రకృతి యునాని
దేశీయ వైద్య
విధానాలు
అందుబాటులోకి
తేవాలి క్యాన్సర్
రోగుల మనోభావాలను
బట్టి సమయం
కేటాయించే
వైద్య సేవల
అందుబాటు
ఆత్మస్థైర్యాన్ని
పెంచుతాయి
క్యాన్సర్ రోగుల్లో
కుంగుబాటు
దూరమై జీవితంపై
ఆశ చిగురిస్తుంది
స్వాంతన సొంతమై




స్వస్థత చేకూరి
కుంగుబాటు
దూరమౌతుంది

ఆరోగ్యకర
జీవనశైలి
మనో నిబ్బరంతో
క్యాన్సర్ రహిత
భారత్ నిర్మాణానికి
పాటుపడుదాం.

నేదునూరి కనకయ్య
(కళ్యాణ్)
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ
ఎకనమిక్ ఫోరమ్
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం'
కరీంనగర్9440245771

# ఘనంగా పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు




సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 22:
ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలను సోమవారం పట్టణం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం పండ్ల పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు, పిఎంకె యువసేన నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా పట్నం మాణిక్యం ఫౌండేషన్ పేరిట సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పిఎంకె యువసేన నాయకులు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఓజీ హవా మామూలుగా లేదు... బెంగళూరులో బెనిఫిట్ షో టికెట్‌కు రూ.3.61 లక్షలు!

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమాపై అభిమానుల భారీ క్రేజ్**
**ఫస్ట్ డే టిక్కెట్లను వేలం వేసి జనసేన పార్టీకి విరాళాలు**
**ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా పార్టీకి చెక్కుల అందజేత**
**బెంగళూరు అభిమానుల నుంచి రూ. 3.61 లక్షల విరాళం**
**చెన్నై ఫ్యాన్స్ నుంచి రూ. 1.72 లక్షలు, చిత్తూరు నుంచి లక్ష రూపాయలు**
**సినిమా అభిమానాన్ని రాజకీయ మద్దతుగా మారుస్తున్న ఫ్యాన్స్**

తిరుపతి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22 (భారత శక్తి):పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ఓజీ (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) విడుదల కాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాపై ఉన్న విపరీతమైన క్రేజ్‌ను అభిమానులు తమ అభిమాన నేత రాజకీయ పార్టీ అయిన జనసేనకు మద్దతుగా మారుస్తున్నారు. సినిమా టిక్కెట్లను వేలం వేసి, వచ్చిన లక్షల రూపాయల మొత్తాన్ని పార్టీకి విరాళంగా అందించి తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.పవన్ కళ్యాణ్ అభిమాన సంఘాలు ఓజీ సినిమా ఫస్ట్ డే టిక్కెట్లను వేలం వేయడం ద్వారా భారీ మొత్తంలో నిధులను సమీకరించాయి. ఇలా సేకరించిన విరాళాలను చెక్కుల రూపంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ నాగబాబుకు అందజేశారు. వివిధ నగరాల్లోని అభిమానులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముఖ్యంగా, బెంగళూరుకు చెందిన అభిమాన సంఘం ఏకంగా రూ. 3.61 లక్షల భారీ మొత్తాన్ని విరాళంగా అందించింది. అలాగే చెన్నైలోని పవన్ కళ్యాణ్ అభిమానులు రూ. 1.72 లక్షలు, చిత్తూరు జిల్లా అభిమానులు రూ. 1 లక్ష చొప్పున చెక్కులను పార్టీకి సమర్పించారు. ఈ మొత్తాలను నాగబాబు స్వీకరించి, అభిమానుల నిబద్ధతను ప్రశంసించారు.తమ అభిమాన నటుడి సినిమా విడుదల వేడుకను కేవలం సంబరంగానే కాకుండా, ఆయన రాజకీయ ప్రస్థానానికి అండగా నిలిచే ఒక అవకాశంగా అభిమానులు భావిస్తున్నారు. సినిమా రంగంలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష ప్రజాదరణ, ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఏ స్థాయిలో ఉపయోగపడుతుందో చెప్పడానికి ఈ సంఘటనే ఒక నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.సుజీత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటించింది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ విలన్ రోల్ లో కనిపించనున్నాడు. శ్రియా రెడ్డి ఓ కీలక పాత్ర పోషించింది. డీవీవీ ఎంటర్టయిన్ మెంట్ బ్యానర్ పై తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

భారతశక్తి




# ఆసియా కప్‌లో మా అబ్బాయి సెంచరీ చూడాలనుంది: అభిషేక్ తల్లి

: ఆసియా కప్ సూపర్ -4 మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత ఓపెనర్ అభిషేక్ విరుచుకుపడ్డాడు. కేవలం 39 బంతుల్లోనే 74 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అయితే సెంచరీ చేస్తాడని అనుకుంటే.. చేజార్చుకున్నాడు. ఈ టోర్నీలో అభిషేక్ బ్యాట్ నుంచి సెంచరీ రావాలని అతడి కుటుంబసభ్యులు ఆకాంక్షించారు. ఆసియా కప్ మ్యాచ్ కోసం అభిషేక్ శర్మ తల్లి మంజు శర్మ, సోదరి కోమల్ శర్మ దుబాయ్‌కు వచ్చారు. పాక్‌తో మ్యాచ్ అనంతరం అక్కడ మాట్లాడుతూ ఆనందం వ్యక్తంచేశారు."అభిషేక్ ఆట చూడటం బాగుంది. పాక్‌పై ఇన్నింగ్స్‌ను ఆస్వాదించాం. తొలి బంతికే సిక్స్ కొట్టడం మరిచిపోలేం. ప్రత్యర్థి బౌలర్ ఎవరనేది చూడకుండా ధైర్యంగా ఆడేస్తాడు. దానిని ఓ అలవాటుగా మార్చుకున్నాడు. మీ అందరి మద్దతు ఇలాగే ఉంటే.. దేశం కోసం మరిన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడతాడు. ఈ టోర్నీలో తప్పకుండా సెంచరీ చూస్తామని ఆశిస్తున్నా" అని మంజు తెలిపారు.

**ఏం చెప్పాలో అర్థం కావడం లేదు: కోమల్**

"ప్రతిసారి భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ చూడాలనుకుంటా. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. అభిషేక్ అద్భుతంగా ఆడాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. ఇంతకంటే ఇంకే కావాలి? అసలు ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. మీరు మమ్మల్ని చూస్తేనే మేం ఎంత సంతోషంగా ఉన్నామో తెలిసిపోతుంది. అద్భుతమైన టాలెంట్ కలిగిన ప్లేయర్. అతడికి ఆకాశమే హద్దు. త్వరలోనే అతడి బ్యాట్ నుంచి సెంచరీ రావాలని కోరుకుంటున్నా. అదొక్క దానికోసమే వెయిటింగ్" అని కోమల్ వెల్లడించారు.

**చిన్నప్పటి నుంచి కలిసి ఆడాం: అభిషేక్**

"పాకిస్థాన్ ఆటగాళ్లు ఎలాంటి కారణం లేకుండానే మా వైపు వచ్చారు. నేను పెద్దగా ఆసక్తి చూపించను. కానీ, అదేపనిగా వస్తుండటంతో గట్టిగా బదులిచ్చాం. జట్టు కోసం మంచి ఇన్నింగ్స్ ఆడాలనే లక్ష్యంతో ఉన్నా. అలాంటప్పుడు వీటిని పెద్దగా పట్టించుకోను. శుభ్‌మన్ గిల్‌తో కలిసి చిన్నప్పటి నుంచి ఆడుతున్నా. మేమిద్దరం ఆటను ఆస్వాదిస్తాం. గిల్ మళ్లీ పుంజుకోవడం ఆనందంగా ఉంది. మేనేజ్‌మెంట్ మద్దతుగా ఉండటం వల్లే స్వేచ్ఛగా ఆడగలిగాం" అని అభిషేక్ తెలిపాడు.

# 'మా వాళ్లు భయపడే రకం కాదు.' గౌతమ్ గంభీర్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు




చూడటానికి నిశ్శబ్దంగా, ఏం మాట్లాడకుండా ఉండే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ (%+ఘఝఎ +ఘఎఎష్ట్రఱతీ ఖీఱతీవ%) ఎప్పుడైనా స్పందించాడంటే అది వైరల్‌గా మారిపోవడం ఖాయం. ఇప్పుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్‌ను భారత్ రెండోసారి చిత్తు చేసిన తర్వాత గంభీర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టాడు. పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్ 'గన్' షాట్‌కు, బౌలర్ హారిస్ రౌఫ్ 'వెకిలి' చేష్టలకు భయపడేదే లేదు అనే అర్థం వచ్చేలా స్టోరీ షేర్ చేశాడు. టీమ్ఇండియా ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తోపాటు టీమ్ఇండియా ఇమేజ్‌లను పోస్టుకు జత చేశాడు.

మ్యాచ్ ముగిసిన తర్వాత 'అంపైర్ల'కు మాత్రమే కరచాలనం చేయాలని.. పాక్ ప్లేయర్లకు అవసరం లేదని మేనేజ్‌మెంట్ నుంచి స్పష్టమైన సందేశం వెళ్లేలా చూశాడు. భారత్ విజయంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాతోపాటు మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో అభినందనలు తెలిపారు.

"కంగ్రాట్స్ టీమ్ఇండియా. ఆసియా కప్‌లో మరోసారి పాక్‌ను ఓడించారు. అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ అదరగొట్టారు" - రాజీవ్ శుక్లా

"అవునూ, ఈ ఆదివారం మీకు ఎలా గడిచింది?(పాక్‌పై వ్యంగ్యంగా). వెల్‌డన్ టీమ్ఇండియా. మిగతా జట్ల కంటే నాణ్యమైన క్రికెట్ ఆడిన టీమ్ అని నిరూపించారు" - ఇర్ఫాన్ పఠాన్

" భారత ఆటగాళ్లూ సూపర్. మరోసారి ఆధిపత్యం ప్రదర్శించినందుకు అభినందనలు" - హర్భజన్ సింగ్

"అభిషేక్ శర్మ, గిల్ చాలా బాగా ఆడారు. ఇక్కడ దూబె కంట్రిబ్యూషన్‌ను మరిచిపోకూడదు. కీలక సమయంలో వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టాడు" - సంజయ్ మంజ్రేకర్

"ఓపెనర్లు ఒకే లక్ష్యంతో బరిలోకి దిగారు. మంచి టైమింగ్‌తో షాట్లు కొట్టారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇలాగే ముమ్ముందూ కొనసాగండి" - యువరాజ్ సింగ్

# ఆడలేక కవ్వింపులు.. నోటికి పనిజెప్పిన పాక్ పేసర్లకు భలే గుణపాఠం




భారత జట్టులో సీనియర్లు లేరు.. కుర్రాళ్లు ఏం బదులు ఇస్తారులే అని కాస్త నోటికి పనిజెప్పిన పాకిస్థాన్ పేసర్లకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. చిన్ననాటి స్నేహితులు, ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. 'మీరు నోరు తెరిస్తే.. మేం బ్యాట్‌తో బాదుతాం. ఇంకా ఎక్కువైతే మేమూ మాటల యుద్ధం చేస్తాం' అన్నట్లుగా సాగింది. 'ఆడలేక మద్దెల ఓడు' అనేలా పాక్ క్రికెటర్ల ప్రవర్తనపై నెట్టింట విమర్శలు వెల్లువెత్తాయి.

భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ అంటే ఎలా ఉంటుందో దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా కప్‌లోని సూపర్-4 మ్యాచ్‌ను చూస్తే అర్థమైపోతుంది. 'కరచాలనం' వివాదంతో ఖంగుతిన్న పాక్ క్రికెటర్లు.. వరుసగా భారత్ చేతిలో ఓడిపోవడంతో వారి అసహనం కట్టలు తెంచుకుంది. సీనియర్ బౌలర్లు షహీన్, హారిస్ రౌఫ్ కాస్త హద్దులు దాటారు. 'ఇలాంటప్పుడు కోహ్లీ' ఉండుంటేనా? అని భారత సగటు అభిమాని కచ్చితంగా మనసులో అనుకొనే ఉంటాడు. అతడు లేకపోతేనేం మేమున్నామంటూ ఓపెనర్లు అభిషేక్, గిల్ ఘాటుగా రిప్లై ఇచ్చారు. కేవలం మాటలతోనే కాకుండా బ్యాట్‌తోనూ సమాధానం ఇచ్చారు. పవర్ ప్లేలో షహీన్‌ను ఆటాడుకున్న అభిషేక్.. హారిస్ వచ్చాక కాస్త ఆచితూచి ఆడాడు. ఇదే అదునుగా యువ బ్యాటర్ వైపు గుర్రుగా చూస్తూ స్లెడ్జింగ్ మొదలుపెట్టాడు. మరోవైపు 'కోహ్లీ' వారసుడిగా భావిస్తోన్న గిల్ మాత్రం కామ్‌గా బదులిచ్చాడు. బౌండరీ లైన్ వద్ద కూడా రౌఫ్ వెకిలి సైగలతో రెచ్చిపోయాడు. భారత ఫైటర్ జెట్‌లను కూల్చేశామని ప్రగల్భాలు పలికిన పాక్ సైన్యం వ్యాఖ్యలను గుర్తు చేస్తూ హావభావాలు చూపించాడు.తొలి బంతి నుంచే..అభిషేక్ శర్మ దూకుడు ఏంటో మనకు తెలుసు. మొదటి బంతి నుంచే ప్రత్యర్థిపై విరుచుకుపడతాడు. అవతల ఎవరు అనేది కూడా చూడడు. పాక్‌తో గ్రూప్ మ్యాచ్‌లోనూ అదిరిపోయే ఓపెనింగ్ ఇచ్చిన అభిషేక్ మరోసారి తొలి బంతికే సిక్స్ కొట్టి తన ఉద్దేశం ఏంటో స్పష్టం చేశాడు. అప్పుడే షహీన్ తన నోటికి పని చెప్పాడు. కానీ, అభిషేక్ వాటినేం పట్టించుకోకుండా ముందుకుసాగాడు. షహీన్ బౌలింగ్ వరుసగా రెండు బౌండరీలు కొట్టినప్పుడు స్లెడ్జింగ్ చేయడంతో గిల్ స్పందిస్తూ 'వెళ్లి బంతి తెచ్చుకో' అంటూ వ్యంగ్యాస్త్రం ప్రయోగించాడు. ఇక రౌఫ్ బౌలింగ్‌కు వచ్చే సమయానికి అది కాస్తా పెద్దదైంది. దాదాపు ప్రతి బంతికి రౌఫ్ భారత ఓపెనర్లను కవ్వించేందుకు ప్రయత్నించాడు. ఒకదశలో అభిషేక్ - రౌఫ్ ఒకరికొకరు చేరువగా వచ్చారు. అయితే, అంపైర్లు కలుగజేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన అభిషేక్ శర్మ అనంతరం స్పందిస్తూ 'వారు ఎలాంటి కారణం లేకుండానే అలా ప్రవర్తించారు. నాకు అలాంటివి పెద్దగా ఇష్టం ఉండదు. జట్టు కోసం మా పని పూర్తి చేయాలని భావించా' అని వ్యాఖ్యానించాడు.ఆ సైగలకు అర్థమేంటో..పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా టీమ్ఇండియా క్రికెటర్లు పాక్ ప్లేయర్లతో కరచాలనం చేయలేదు. గ్రూప్ మ్యాచ్ అనంతరం విజయాన్ని బాధితులకు అంకితం చేస్తున్నట్లు కెప్టెన్ సూర్య తెలిపాడు. సూపర్-4లో పాకిస్థాన్ ఏ ఛాన్స్‌ను వదలకూడదని భావించినట్లుంది. భారత్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నించింది. తొలి బంతి వేసిన తర్వాత పాక్ ఓపెనర్ సాహిబ్‌జాద ఫర్హాన్ ప్రవర్తించిన తీరే తార్కాణం. మైండ్ గేమ్ మొదలుపెట్టాడు. ఏ కారణం లేకుండానే చేతికి వేసుకున్న బ్యాండ్‌ను మార్చుకొన్నాడు. ఒత్తిడిని అధిగమించేందుకు ఇదొక ట్రిక్ ప్లే చేశాడు. అభిషేక్ క్యాచ్ వదిలేసిన తర్వాత కాస్త పైచేయి సాధించేలా కనిపించింది. ఇక అర్ధశతకం చేసిన తర్వాత 'గన్' ఫైర్ చేస్తున్నట్లుగా ఫర్హాన్ సైగలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తన సంబరాలను ఈవిధంగా చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. పాక్ బ్యాటింగ్ సమయంలో వారి 'మైండ్‌గేమ్' వర్కౌట్ కాలేదు. దీంతో పాక్ బౌలర్లు ఆ బాధ్యతను తీసుకొనేందుకు ప్రయత్నించారు. తీరా, టీమ్ఇండియా ఓపెనర్ల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో తోక ముడిచారు.

# ఎంతెంత దూరం



కెన్యా 2.. జమైకా 8.. ట్రినిడాడ్ అండ్ టొబాగో 11.. క్యూబా 12.. బోత్స్‌వానా, ఈక్వెడార్ 13.. టాంజానియా 16.. ఇథియోపియా 20.. బహ్రెయిన్ 24.. ఆదివారం టోక్యోలో ముగిసిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పతకాల పట్టికలో కొన్ని దేశాల స్థానాలివీ. మరి భారత్ స్థానమెంతో తెలుసా..? సున్నా! ఒక్క పతకం కూడా గెలవడకపోవడమే ఇందుకు కారణం. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలనుకుంటున్న భారత్.. అసలు ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఎక్కడుంది? ప్రపంచ స్థాయి ప్రమాణాలకు ఎంత దూరంలో ఉంది?


198 దేశాలు.. 2202 మంది అథ్లెట్లు పాల్గొన్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఒక్కటంటే ఒక్క పతకం నెగ్గలేదు. కొన్నేళ్లుగా ఆశాజ్యోతిగా మారిన స్టార్ జావెలియన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈసారి నిరాశపరచడంతో భారత్ ఖాతా కూడా తెరవలేకపోయింది. దేశం నుంచి 19 మంది అత్యుత్తమ క్రీడాకారులు బరిలో దిగగా.. జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్ నాలుగో స్థానమే ఈ పోటీల్లో భారత్ తరఫున అత్యుత్తమ ప్రదర్శన. నీరజ్ ఎనిమిదో స్థానంలో నిలవగా.. భారత క్రీడాకారుల్లో అత్యధికులు తుది పోరుకు కూడా అర్హత సాధించలేకపోయారు. 1983లో ప్రారంభమైన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు భారత్ గెలుచుకున్న పతకాలు ముచ్చటగా మూడు. అందులో నీరజ్ సాధించినవే రెండు. 2022 యూజీన్‌లో రజతం, 2023 బుడాపెస్ట్‌లో బంగారు పతకంతో నీరజ్ సత్తా చాటాడు. 2003 పారిస్‌లో అంజూ బాబీ జార్జ్ (లాంగ్‌జంప్)లో కాంస్యం నెగ్గింది.

నిజానికి అథ్లెటిక్స్‌లో భారత్‌ది ఎప్పుడూ వెనుకబాటే. భారత అథ్లెటిక్స్ అనగానే మిల్కా సింగ్, పి.టి.ఉష పేర్లే దశాబ్దాల పాటు వినిపించాయి. కొంతకాలం పాటు అంజూ బాబీ జార్జ్ మెరిసింది. ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత్ పేరు మారుమోగేలా చేసిన ఘనత మాత్రం ముమ్మాటికీ నీరజ్ చోప్రాదే. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం.. 2024 పారిస్ క్రీడల్లో రజత పతకంతో అదరగొట్టాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు.. డైమండ్ లీగ్‌లో నాలుగు పతకాలతో హోరెత్తించాడు. అయిదేళ్లుగా ఎదురులేని నీరజ్ జావెలిన్.. టోక్యో ప్రపంచ అథ్లెటిక్స్‌లో గురితప్పడం ఊహించని పరిణామమే. కచ్చితంగా పతకం గెలుస్తాడనుకున్న నీరజ్.. ఒక టోర్నీ ఫైనల్లో విఫలమైనంత మాత్రాన అతని పనైపోయినట్లు కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్న నీరజ్ మళ్లీ పుంజుకోవడం.. పతకాలు సాధించడం కష్టమేమీ కాకపోవచ్చు. ప్రపంచ జావెలిన్‌లో నీరజ్ ఇప్పటికీ స్టారే అనడంలో సందేహం లేదు. అయితే మిగతా క్రీడాకారుల సంగతేంటన్నది ప్రశ్న.

ప్రపంచ పోటీల్లో పతకం సాధించకపోయినా ఆకట్టుకున్న ఆటగాడు సచిన్ యాదవ్. 86.27 మీటర్లు జావెలిన్‌ను విసిరి తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. కాంస్యం గెలిచిన కర్టిస్ థాంప్సన్ (86.67 మీ- అమెరికా)కు కేవలం 0.40 మీటర్ల దూరంలో నిలిచాడు. యశ్ వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు కనీసం 80 మీటర్ల మార్క్‌ను కూడా చేరుకోలేకపోయారు. లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయినా.. అతని మీద అంచనాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ పోటీల్లో స్వర్ణం నెగ్గిన మటియా ఫుర్లాని (8.39 మీ- ఇటలీ) కంటే శ్రీశంకర్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన (8.41 మీ) మెరుగ్గా ఉండటమే ఇందుకు కారణం. 10,000 మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్‌ది అదే పరిస్థితి. ఈ పోటీల్లో గుల్వీర్ 16వ స్థానంలో నిలిచినా.. స్వర్ణం గెలిచిన జిమ్మీ గ్రేసియెర్ (28 నిమిషాల 55.77 సెకన్లు - ఫ్రాన్స్) కంటే అతని వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన టైమింగ్ (27 ని 0.22 సె) మెరుగ్గా ఉంది. హైజంప్‌లో ఆరో స్థానంలో నిలిచిన సర్వేష్ అనిల్ కుశారేను మరింతగా సానబెట్టొచ్చు. మహిళల జావెలిన్‌లో అన్ను రాణి ఇప్పటికీ భారత్‌కు తురుపుముక్కే. టోక్యోలో అన్ను ఫైనల్లో అడుగుపెట్టకపోయినా అగ్రస్థానం సాధించిన జులేసీ ఏంజులో (65.12 మీటర్లు- ఈక్వెడార్) కంటే భారత క్రీడాకారిణి వ్యక్తిగత ప్రదర్శన (63.82 మీ) మెరుగ్గానే ఉంది. ప్రవీణ్ చిత్రవేల్, అబ్దుల్లా అబూబాకర్ (ట్రిపుల్ జంప్), అనిమేష్ కుజుర్ (200 మీ), తేజస్ శిర్సే (110 మీ హర్డిల్స్), శెర్విన్ సెబాస్టియన్ (20 కిమీ రేస్ వాక్), సందీప్ కుమార్, రామ్ బాబూ (35 కిమీ రేస్ వాక్), పూజ (800 మీ, 1500 మీ), పారుల్ చౌదరి, అంకిత ధ్యాని (3000 మీ స్టీపుల్ ఛేజ్), ప్రియాంక గోస్వామి (35 కిమీ రేస్ వాక్) మరింత మెరుగైతేనే ప్రపంచ ప్రమాణాల్ని అందుకోగలరు. జ్యోతి యర్రాజి (110 మీ హర్డిల్స్), అగసర నందిని (హెప్టాథ్లాన్) లాంటి యువ క్రీడాకారిణుల్ని సానబెడితే భారత అథ్లెటిక్స్‌కు మంచి భవిష్యత్తు ఉంటుంది.

# అమెరికాదే ఆధిపత్యం

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అమెరికా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. టోక్యో ఛాంపియన్‌షిప్‌ను ఆ దేశం అగ్రస్థానం (26 పతకాలు)తో ముగించింది. ఇందులో 16 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు ఉన్నాయి. చివరి రోజు, ఆదివారం 4ఐ100 మీటర్ల రిలేలో అమెరికా 'డబుల్' సాధించింది. 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలోనూ పసిడి సైతం అమెరికా ఖాతాలోనే చేరింది. మహిళల టీమ్‌లో షెరికా రిచర్డ్‌సన్, మెలిసా జెఫర్సన్, పురుషుల్లో నోవా లైల్స్, కోల్‌మన్ అమెరికా విజయాల్లో కీలకపాత్ర పోషించారు. కెన్యా 11 పతకాలు (7 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలు), కెనడా 5 (3 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యం) రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి.





# నాకు సినిమాలు తప్ప పెద్ద డ్రీమ్స్ లేమీ లేవు

'ఇది మలయాళ సినిమాకు వచ్చిన అవార్డు. నిజాయితీగా పని చేయడంతోపాటు భగవంతుడి ఆశీస్సుల వల్లే ఈ పురస్కారం దక్కిందను కుంటున్నా. నన్ను అభిమా నించే వారందరికీ ఈ అవార్డు చెందు తుంది. నాకు సినిమా తప్ప పెద్ద డ్రీమ్స్ ఏమీ లేవు' అని ప్రముఖ నటుడు మోహన్‌లాల్ అన్నారు. నటుడు, నిర్మాత, దర్శకుడు, గాయకుడిగా చిత్ర పరిశ్రమకు మోహన్‌లాల్ చేసిన సేవలకుగాను ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపిక చేసినట్లు కేంద్రం శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 2023 సంవత్సరానికిగానూ ఆయనకి ఈ అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,'ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికయ్యారంటూ ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వస్తే నమ్మలేకపోయా. కలలో ఉన్నానేమో అనుకుని ఆ విషయాన్ని మరోసారి చెప్పమన్నాను. ఎంతో మంది గొప్ప వ్యక్తులు ప్రయాణించిన దారిలోనే నేనూ నడిచా. నేనేం సాధించినా దానికి కారణం వారే. 48 ఏండ్ల నా ప్రయాణంలో నేను కలసి పని చేసిన కొందరు ఇప్పుడు లేరు. కానీ ఆ జ్ఞాపకా లెప్పుడూ నాతోనే ఉంటాయి. ఫలానా పాత్రలో నటించాలని ఎప్పుడూ అనుకోను.కథ, కాంబినేషన్స్‌పైనే ఎక్కువ ఆసక్తి చూపిస్తా. ప్రేమ్ నజీర్, అమితాబ్ బచ్చన్, శివాజీ గణేశన్ వంటి వారితో కలసి నటించటం గొప్ప అనుభూతి' అని చెప్పారు. ఈ నెల 23న ఢిల్లీలో జరిగే 71వ జాతీయ చలన చిత్ర పురస్కార ప్రదానోత్సవ వేడుకలో మోహన్‌లాల్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. నేటి నుంచి 'దృశ్యం 3' చిత్రీకరణ షురూ.. సోమవారం నుంచి 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణ ప్రారంభం అవుతుందని మోహన్‌లాల్ చెప్పారు. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిన 'దృశ్యం' అన్ని భాషల్లోనూ సంచలన విజయం సాధించింది. మోహన్ లాల్, మీనా కాంబోలో జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంచైజీలో 'దృశ్యం 2' కూడా వచ్చింది. రెండు పార్టులు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. 'దృశ్యం 3' గురించి నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడించనుంది.

## 'ఇడ్లీ కొట్టు' కోసం
# చావడానికైనా సిద్ధం

'దమ్మిడికి పనికిరాని వాళ్ళ నాన్న ఇడ్లీ కొట్టు కోసం వాడు చావడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు' వంటి డైలాగ్స్‌తో ఉన్న 'ఇడ్లీకొట్టు' ట్రైలర్ అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ధనుష్, నిత్యామీనన్ జంటగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'కుబేర'తో బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్న హీరో ధనుష్ 'ఇడ్లీ కొట్టు' సినిమాలో ఓ సాధారణ వ్యక్తి పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బ్యానర్స్ పై ఆకాష్ బాస్కరన్ నిర్మిస్తున్నారు. ధనుష్ దర్శకత్వం వహించిన నాలుగో సినిమా ఇది. తాజాగా మేకర్స్



ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'తన తండ్రిని ఒప్పిస్తూ 'ఇడ్లీ గ్రైండర్ కొంటే పని తేలిక అవుతుంది, సమయం కూడా ఆదా అవుతుంది' అని చెప్పే సన్నిశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం అలరిస్తోంది. ధనుష్ ఈ సినిమాలో మురళి పాత్రలో నటిస్తున్నారు. తన తండ్రి దగ్గర ఉన్న సంప్రదాయ ఇడ్లీ కొట్టుతో మురళికి మంచి అనుబంధం ఉంటుంది. ఆ ఇడ్లీ బండి వాళ్ళ ఊరోళ్ళందరికీ చాలా సెంటిమెంట్.

మురళి హోటల్ మేనేజ్‌మెంట్‌లోకి వెళ్లి, అరణ్ విజయ్ చేసిన అశ్విన్ పాత్రతో కలిసి పనిచేస్తాడు. వ్యాపారంలో లాభాలు పెరగడానికి మురళి సహాయం చేస్తాడు. కానీ అశ్విన్ నుంచి వచ్చే బెదిరింపులు మురళి భవిష్యత్తును మాత్రమే కాదు, తన తండ్రి పేరు, వారసత్వానికి సవాల్‌గా మారుతాయి. దాంతో మురళి ఎదుర్కోబోయే సవాళ్లు, తన గౌరవం కోసం చేసే పోరాటమే కథలో ప్రధానంగా మారుతుంది. నిత్యా మీనన్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధనుష్, నిత్యాల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ అద్భుతంగా పండింది. అరుణ్ విజయ్, శాలిని పాండే, సత్యరాజ్ పాత్రలు కూడా కీలకంగా ఉన్నాయి. డైరెక్టర్‌గా ధనుష్ హార్ట్ టచ్చింగ్ ఎమోషన్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. దీంతో ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది అని మేకర్స్ తెలిపారు. శ్రీ వేదక్షర మూవీస్ బ్యానర్ ద్వారా నిర్మాత రామారావు చింతపల్లి తెలుగులో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళంలో అక్టోబర్ 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ధనుష్ సినిమా అంటే కచ్చితంగా మంచి కంటెంట్ ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో బలంగా ఉంది. ఈ సినిమాలోనూ అలాంటి మంచి కంటెంట్ ఉంది' అని నిర్మాత రామారావు చింతపల్లి చెప్పారు.

# యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



త్రినాధ్ కఠారి హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సంజీవని ప్రొడక్షన్స్ బ్యానర్ పై బళ్లారి శంకర్ నిర్మిస్తున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కి 'ఇట్లు మీ ఎధవ' అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు. 'వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు' అనేది ట్యాగ్ లైన్. తెలుగు అమ్మాయి సాహితీ అవాంచ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గ్లింప్స్ చాలా బావుంది. చాలా ఫన్నీగా ఉంది. ప్రతి అబ్బాయికి ఈ టైటిల్ చిన్నప్పటి నుంచి కెరీర్‌లో సెటిల్ అయిన తర్వాత కూడా అలాగే ఉంటుంది. అలాంటి టైటిల్ పెట్టారు (నవ్వుతూ). ఇది మంచి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్' అని అన్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌లో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీ ప్రసాద్, మధుమణి, సురభి ప్రభావతి, తాగుబోతు రమేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇటీవల నాలుగు ఇంటర్నేషనల్ అవార్డ్స్ సాధించిన జగదీష్ చీకటి డీవోపీగా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: త్రినాధ్ కఠారి, నిర్మాత: బళ్లారి శంకర్, ఎడిటర్: ఉద్ధవ్ ఎస్.బి., ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మల్లికార్జున్, లైన్ ప్రొడ్యూసర్: బృంధావన్ కేతిరెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్: బృందావర్ధని అవ్వారు.

**ప్రతి అబ్బాయికి ఈ టైటిల్ చిన్నప్పటి నుంచి కెరీర్‌లో సెటిల్ అయిన తర్వాత కూడా అలాగే ఉంటుంది**

## ఘనంగా 'మనం సైతం'
# పుష్కర మహోత్సవం


నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మనం సైతం' ఫౌండేషన్ పుష్కర మహోత్సవం ఆదివారం ఫిలింఛాంబర్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ, 'సీనియర్ జర్నలిస్ట్ జి.కృష్ణ శిష్యుడిని. ఆ మహనీయుడి స్ఫూర్తితోనే సామాజిక సేవ ఆలోచన వచ్చింది. 12 ఏళ్లుగా చేస్తున్న ఈ సేవలో ఎందరో మహాను భావులు ఆశీర్వదించారు.

మద్దతు తెలిపారు. వారందరి సహకారంతోనే ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నాం' అని అన్నారు. 'ఆపదలో ఉన్నవారికి సేవ చేస్తే భగవంతుడు మనకు మేలు చేస్తాడు. కిరణ్‌కు దేవుడు మంచి మనసు ఇచ్చాడు' అని సినీ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు చెప్పాడు.

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, 'కరోనా సమయంలో వందలాది కుటుంబాలకు కాదంబరి కిరణ్ సాయం చేశారు. కిరణ్ సేవలకు మా మద్దతు ఉంటుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, కాజా సూర్య నారాయణ, జర్నలిస్ట్‌లు సురేష్ కొండేటి, దేవులపల్లి అమర్, పృథ్వీ, సాయి, టీవీ5 మూర్తి, ఏఎన్ఎన్ ఛానల్ సీఈఓ కంది రామచంద్ర రెడ్డి, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, టి.రామసత్యనారాయణ, అశోక్ కుమార్, టీఆర్ఎస్ రాఘవ, సాంబశివరావు, డీవీ రావు తదితరులు పాల్గొని 'మనం సైతం'తో కాదంబరి కిరణ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు.

# హిట్ సినిమాల కోవలో..

పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణ రెడ్డి రచన, స్వీయ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'దేవగుడి'. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను ఆంధ్రప్రదేశ్ విప్,




జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, మంత్రి మందిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, 'మా చిత్ర ఫస్ట్ లుక్ లాంచ్ వేడుకకు ప్రజా సేవలో ఎంతో బిజీగా ఉండి కూడా మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, మంత్రి మందిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. మా నాయకుల నిబద్ధతను ప్రేరణగా తీసుకొని, ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ప్రస్తుతం ఎన్నో హిట్ సినిమాలు వస్తున్నాయి.

వాటి కోవలోనే మా చిత్రమూ ఉంటుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'ఇండస్ట్రీలో ఎంతో కష్టపడి ఎదగాలని వచ్చిన నాకు అవకాశం ఇచ్చిన మా దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు' అని నటుడు అభినవ్ శౌర్య చెప్పారు. మరో నటుడు నరసింహ మాట్లాడుతూ,' ఈ సినిమా కోసం దర్శక, నిర్మాత రామకృష్ణారెడ్డి ఎంతగానో కష్టపడ్డారు. కేవలం ఆయన డెడికేషన్ వల్ల సినిమా ఈ స్థాయిలో వచ్చింది' అని తెలిపారు. అనుశ్రీ మాట్లాడుతూ, 'నాకు ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా దర్శక, నిర్మాతలకు ప్రత్యేక ధన్యవాదాలు' అని అన్నారు. ''దేవగుడి' అనేది ఎంత పవర్‌ఫుల్ టైటిలో, ఈ సినిమాలో కూడా ఎమోషన్ అంతే పవర్‌ఫుల్‌గా ఉంటుంది. విజువల్‌గా ఈ సినిమా ఓ సరికొత్త ట్రీట్ ఇస్తుంది' అని డిఓపి లక్ష్మీకాంత్ చెప్పారు.

# సైకిల్ రేసర్‌గా శర్వా



ఎప్పటికప్పుడు వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న కథా నాయకుడు శర్వా.. ఈసారి సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఆయన అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇది ఆయన నటిస్తున్న 36వ చిత్రం. స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్‌గా శర్వా నటిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. శర్వా, టీమ్‌పై సైకిల్ రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాకి ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయి. యూనిక్ క్యారెక్టర్స్‌తో ఆకట్టుకునే శర్వా ఈ చిత్రంలో ఓ ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఆడ్రినలిన్ రష్‌ని ఇచ్చే స్టంట్స్‌తో అదరగొట్టబోతున్నారు. ఈ చిత్రంలో మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాతలు వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ హై-ఎనర్జీ మూవీ మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

'మా కథానాయకుడు శర్వా.. సరికొత్త పాత్రతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనున్నారు. కంటెంట్ పరంగా ఆయన ప్రతి సినిమా అద్భుతంగా ఉంటుంది. అలాగే ఆయన పోషించే పాత్రలు సైతం అదే తీరుతో ఉంటూ ప్రేక్షకులను, ఆయన అభిమానులను విశేషంగా అలరిస్తున్నాయి. ఈ సినిమా కూడా అదే కోవలో ఉంటుంది. ఈ సినిమాలోని పాత్రను శర్వా ఎంతో ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. సినిమా చాలా అద్భుతంగా వస్తోంది. దర్శకుడు అభిలాష్ తనదైన కథ, మేకింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తాడని ఆశిస్తున్నాం. త్వరలోనే మరిన్ని వివరాలను తెలియజేస్తాం' అని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర, నిర్మాతలు: వంశీ-ప్రమోద్, సమర్పణ: విక్రమ్, సంగీతం: జిబ్రాన్, డీవోపీ: యువరాజ్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఎడిటర్: అనిల్ కుమార్ పి., ఆర్ట్ డైరెక్టర్: ఎ పనీర్ సెల్వం.

# అల్మాస్ గూడ ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

* **నాలాలను వెంటనే క్లీన్ చేయాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్ పేట్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్గూడ గ్రామం జైశంకర్ కాలనీ, సాయిరాం కాలనీ ముంపుకు గురైన ప్రాంతాలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యక్షంగా పర్యటించారు. వరద ముప్పు బాధితులతో మాట్లాడి సమస్య పరిష్కారం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ముంపుకు గల అసలు కారణాలు తెలుసుకున్నారు.ముఖ్యంగా మున్సిపల్ సిబ్బంది అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళికలో కనీసం నాలాలలోని మట్టి, చెత్త తొలగించకపోవడం ప్రధాన కారణమని స్పష్టం చేశారు. వర్షాలు పడ్డాక నాలాల దగ్గరికి వెళ్లి పరిశీలించడం కాకుండా, ముందుగానే నాళాలను శుభ్రం చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా



అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణమే కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని బిఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, ముత్యాల కృష్ణ,ఏనుగు రామిరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




## చిత్రా లేఅవుట్ లో
## లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ హైట్స్ మెగా క్యాంప్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): చిత్రా లేఅవుట్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ హైట్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ సంయుక్తంగా నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని 320D గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు ప్రారంభించారు.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు లయన్ గోలీ అమరేందర్ రెడ్డి (పీడీజీ 320ఈ) లయన్ రమాదేవి రెడ్డి (డీఎస్ క్యాన్సర్) లయన్ అంజిరెడ్డి ముస్కు, లయన్ మల్లికార్జున రావు రేపాల, లయన్ పోచంపల్లి ఇంద్రసేన రెడ్డి, లయన్ విజయ్ పాళ్యం,లయన్ ఎంఏ మన్నన్,లయన్ భరత రాజేంద్ర ప్రసాద్,ఇతర లయన్ డిగ్నిటరీస్ పాల్గొన్నారు.ఈ హెల్త్ క్యాంప్ లో ఆర్థోపెడిక్, జనరల్ చెకప్, డెంటల్, ఐ, క్యాన్సర్ డిటెక్షన్ వంటి వైద్య సేవలు నిపుణులచే అందించబడ్డాయి. కాలనీ వాసులకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. మొత్తం 195 పైన సభ్యులు ఈ సేవలను వినియోగించుకున్నారు. అందులో 98 పైగా మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్నారు.ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా మా హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు అందించిన సహకారం, సమయం, సేవలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలిచాయి.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని లయన్స్ క్లబ్ మెగా హెల్త్ క్యాంప్ వారు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రజావాణి దరఖాస్తులను
## త్వరితగతిన పరిష్కరించాలి

* **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి**

సంగారెడ్డి, సెప్టెంబర్ 22 (భారత శక్తి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 33 దరఖాస్తులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, డి.ఆర్.ఓ పద్మజా రాణి కలిసి అర్జీదారుల నుండి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ...అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించడంలో ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరద బాధితులైన
## సిక్కులను ఆదుకున్న బద్దూరి..

ఎల్బీనగర్, సెప్టెంబర్ 22 (భారత శక్తి ): గత కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు, భవన నిర్మాణ కార్మికులైన సిక్కు సోదరులు వరదలకు అన్నీ కోల్పోయి రాష్ట్ర రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి సహాయం కోరారు.అందుకు వెంటనే స్పందించిన ఆయన వారి కుటుంబాలకు 3 క్వింటాల బియ్యం తక్షణమే సహాయం చేశారు.ఈ సందర్భంగా సిక్కు సోదరుల కమిటీ సభ్యులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డికి వారి కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలిపి ఆ భగవంతుడు అన్నీ విధాలుగా ఆయనకు సహకరించి మాలాంటి



పేదవారికి సహాయం చేసేలా అష్టైశ్వర్యాలు ఇవ్వాలని కోరుకున్నారు.

# నగరంలో యుద్ధ ప్రాతిపదికన రోడ్ సేఫ్టీ డ్రైవ్..

* **డ్రైవ్ లో భాగంగా నేటి వరకూ 12,276 గుంతలను పూడ్చివేత**
* **ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్న కమిషనర్ ఆర్వీ కర్ణన్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్లు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. సెప్టెంబర్ 22 సోమవారం నాటికి నగరంలో మొత్తం 14,631 గుంతలు గుర్తించడం జరిగింది. వాటిలో 12,276 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. నిన్నటి వరకు 12,181 గుంతలను పూడ్చివేయగా, ఇవాళ ఒక్కరోజే 95 గుంతలకు




మరమ్మతులు చేయడం జరిగింది. జోన్ల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి : ఎల్బీనగర్ జోన్‌లో 2,611 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. చార్మినార్ జోన్‌లో 1,976 గుంతలను పూడ్చడం జరిగింది. ఖైరతాబాద్ జోన్‌లో 1,631 గుంతలను పూడ్చడం జరిగింది. శేరిలింగంపల్లి జోన్‌లో 1,360 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. కూకట్‌పల్లి జోన్‌లో 2,040 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. సికింద్రాబాద్ జోన్‌లో 2,658 గుంతలను పూడ్చడం జరిగింది. జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మత్తు పనులు వేగంగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు.

## శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

- **అమ్మవారి మొదటి పూజలో పాల్గొన్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి..-**
- **పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు..**

బడంగ్ పేట్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని బాలాపూర్ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి జరిగిన మొదటి పూజలో పాల్గొని అనంతరం దర్శించుకున్నారు మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నరసింహారెడ్డి. ఈ పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర జైహింద్,



నాయకులు టేకుల శశిధర్ రెడ్డి, వంగేటి కొండల్ రెడ్డి, టేకుల సుధాకర్ రెడ్డి, తూళ్ళ నరహరి గౌడ్, ఇక్కే కొండల్, గండికోట యాదయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సంఘవికాసంతోనే దేశాభివృద్ధి

కరీంనగర్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): సంఘవికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. సోమవారం నగరంలోని శిశు మందిర్ లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకులలో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్ఎస్ఎస్ శాఖలో నిర్మాణం జరుగుతుందని వివరించారు. 1925 నుండి సంఘ శాఖల ద్వారా వ్యక్తి నిర్మాణము జరుగుతుందని ఆయన తెలిపారు. శరీరంలోని ప్రతి కణం శరీర ధారుఢ్యానికి ఏ విధంగా పనిచేస్తాయో, దేశంలోని సామాన్య వ్యక్తులు కూడా దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు.




భారతదేశ పరమ వైభవం ద్వారానే విశ్వ కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని చెప్పారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాలలో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ సత్యనారాయణ , మల్లోజుల కిషన్ రావు, శిక్షణకు వచ్చిన స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.డి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో
## గెట్ టూ గెదర్ పార్టీ వేడుకలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 22 (భారత శక్తి) : ఆర్.డి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినిలు గెట్ టు గెదర్ పార్టీవేడుకలను భీమారం లోని జగతి గార్డెన్స్ లో అట్టహాసంగా సోమవారం నిర్వహించుకున్నారని కళాశాల ఛైర్మెన్ రాంమూర్తి,డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ సంజీవరావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో దాగివున్న ప్రతిభా పాటవాలు, సృజనాత్మకశక్తి వెలుగులోకి వస్తాయని తెలిపారు.ఇలాంటి పార్టీలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో స్నేహభావం,సోదర భావం




పెంపొందుతుందని ప్రిన్సిపాల్ సంజీవ రావు తెలిపారు.అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సంజీవ్ రావు,అధ్యాపకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మల్లేశం,జాయింట్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై ఇది తెలంగాణ భవన్ కాదు.. 'జనతా గ్యారేజ్'

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి)**:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై తెలంగాణ భవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే 'జనతా గ్యారేజ్' అని ఆయన ప్రకటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇక్కడికి రావచ్చని, న్యాయ సహాయం కోసం నిపుణులైన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ వల్ల నష్టపోతున్న రైతులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. నల్గొండ, సూర్యాపేట, గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చిన బాధితులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులతో తామే స్వయంగా రోజుల తరబడి చర్చలు జరిపి, మెరుగైన పరిహారం, ఇళ్లు ఇచ్చి ఒప్పించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లడానికే ముఖం చాటేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే అలైన్‌మెంట్లు మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని కేటీఆర్ విమర్శించారు. అలైన్‌మెంట్లు మార్చి పేదల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని అన్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా ఖరారు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో రైతులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని ఆయన రైతులకు సూచించారు. అలా చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి సమస్యను పరిష్కరిస్తాయని తెలిపారు.

### హైదరాబాద్ సహా తెలంగాణలోని
## పలు ప్రాంతాల్లో భారీ వర్షం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి)** : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట మొదలైన ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచిపోయింది. ఖైరతాబాద్ రాజ్ భవన్ రోడ్డులో మోకాలి లోతు వరకు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా మరియు జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం, మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

### ట్రంప్ హెచ్–1బీ వీసా దెబ్బ
## టేకాఫ్‌కు ముందు విమానం దిగేసిన భారతీయులు

**అమెరికా, సెప్టెంబర్ 22 (భారత శక్తి)**: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్ 1బీ వీసాలపై తీసుకున్న ఆకస్మిక నిర్ణయం తీవ్ర గందరగోళానికి దారితీసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి లక్ష డాలర్ల ఫీజు విధిస్తున్నట్లు ప్రకటించడంతో భయాందోళనలకు గురైన పలువురు భారతీయ ప్రయాణికులు, టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న విమానం నుంచి కిందకు దిగిపోయారు. ఈ అనూహ్య పరిణామంతో శాన్‌ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయంలో తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి భారత్‌కు బయలుదేరాల్సిన ఎమిరేట్స్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రంప్ ప్రకటన వెలువడిన వెంటనే, అమెరికాను విడిచి వెళితే తిరిగి రాలేమేమోనన్న ఆందోళనతో ప్రయాణికులు విమానం దిగేందుకు సిద్ధమయ్యారు. దీంతో విమానంలో గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రయాణికులు తమ ఫోన్లలో వార్తలు చూస్తూ, ఏం చేయాలో తెలియక ఆందోళన చెందారు. పరిస్థితిని గమనించిన విమాన కెప్టెన్, ప్రయాణం రద్దు చేసుకోవాలనుకునే వారు విమానం నుంచి దిగిపోవచ్చని ప్రకటించారు. ఈ ఘటన కారణంగా విమానం సుమారు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ఈ పరిణామాలపై ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో వీడియోలను పంచుకున్నారు. "ఇది పూర్తి గందరగోళం. ట్రంప్ నిర్ణయంతో భారతీయ ప్రయాణికుల్లో భయం నెలకొంది. చాలా మంది విమానం దిగిపోవడానికే మొగ్గు చూపారు" అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన మెటా, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలు తమ ఉద్యోగులకు కీలక సూచనలు జారీ చేశాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్ 1బీ వీసా హోల్డర్లు కనీసం రెండు వారాల పాటు దేశం విడిచి వెళ్లవద్దని కోరాయి. అలాగే, విదేశాల్లో ఉన్న తమ ఉద్యోగులు 24 గంటల్లోగా తిరిగి అమెరికాకు రావాలని సూచించాయి. ఈ గందరగోళంపై వైట్‌హౌస్ స్పష్టత ఇచ్చింది. లక్ష డాలర్ల ఫీజు అనేది కొత్తగా హెచ్ 1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే వర్తిస్తుందని, అది కూడా ఒక్కసారి చెల్లించే ఫీజు అని ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ తెలిపారు. ప్రస్తుత వీసా హోల్డర్లకు, పునరుద్ధరణలకు ఈ నిబంధన వర్తించదని ఆమె స్పష్టం చేశారు. అమెరికన్ కార్మికులకు బదులుగా తక్కువ నైపుణ్యం ఉన్న విదేశీయులను నియమించడాన్ని అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ యంత్రాంగం తెలిపింది.

## గుజరాత్ తీరంలో మంటల్లో చిక్కుకున్న నౌక

**గుజరాత్, సెప్టెంబర్ 22 (భారత శక్తి)**:గుజరాత్‌లోని పోర్‌బందర్ తీరంలో తీవ్ర కలకలం రేగింది. జెట్టీ వద్ద నిలిపి ఉంచిన ఓ భారీ సరుకు రవాణా నౌక అగ్నికి ఆహుతైంది. మంటలు వేగంగా వ్యాపించి నౌక మొత్తాన్ని చుట్టుముట్టడంతో పరిస్థితి అదుపు తప్పింది. తీరంలో పెను ప్రమాదం జరగకుండా నివారించేందుకు, అధికారులు మండుతున్న నౌకను సముద్రంలోకి నెట్టివేశారు. వివరాల్లోకి వెళితే, జామ్‌నగర్‌కు చెందిన హెచ్‌ఆర్ఎం అండ్ సన్స్ అనే సంస్థకు చెందిన ఈ నౌకలో పంచదార, బియ్యం వంటి సరుకులు ఉన్నాయి. ఈ లోడుతో నౌక సోమాలియాలోని బొసాసో నగరానికి బయలుదేరాల్సి ఉంది. అయితే, జెట్టీ వద్ద ఉండగానే ఒక్కసారిగా నౌకలో మంటలు చెలరేగాయి. అవి క్షణాల్లోనే విస్తరించి భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో, జెట్టీకి, సమీపంలోని ఇతర నౌకలకు ప్రమాదం జరగకుండా ఉండేందుకు అధికారులు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. మంటల్లో కాలిపోతున్న నౌకను తీరం నుంచి దూరంగా సముద్రంలోకి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## యుద్ధం అక్కర్లేదు... పీవోకే మనదే అవుతుంది

**ఢిల్లీ, సెప్టెంబర్ 22 (భారత శక్తి)** :పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకునేందుకు యుద్ధం చేయాల్సిన అవసరం లేదని, అది తనంతట తానుగానే భారత్‌లో విలీనం అవుతుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. పీవోకేలో పరిస్థితులు మారుతున్నాయని, అక్కడి ప్రజలే పాకిస్థాన్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన, అక్కడి భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజలు పాకిస్థాన్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, స్వేచ్ఛ కోసం ఉద్యమిస్తున్నారని ఆయన తెలిపారు. "పీవోకేలో డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. మీరు నినాదాలు వినే ఉంటారు. 'నేను కూడా భారతీయుడినే' (మెయిన్ భీ భారత్ హూన్) అంటూ అక్కడ నినాదాలు మిన్నంటున్నాయి. కాబట్టి మనం బలప్రయోగం చేయాల్సిన అవసరం రాదు" అని రాజ్‌నాథ్ వివరించారు. ఐదేళ్ల క్రితం కశ్మీర్ లోయలో సైనికులతో మాట్లాడినప్పుడు కూడా ఇదే విషయాన్ని తాను చెప్పానని ఆయన గుర్తుచేశారు. పీవోకేను తిరిగి చేజిక్కించుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' సమయంలో చేజార్చుకుందంటూ విపక్షాలు విమర్శలు చేస్తున్న తరుణంలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మే 7న జరిగిన ఆ ఆపరేషన్‌లో భారత్‌కు పైచేయి ఉన్నప్పటికీ, కేవలం కాల్పుల విరమణ ఒప్పందంతో సరిపెట్టుకుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే ప్రసంగంలో, ఇతర దేశాల చర్యలపై భారత్ సంయమనంతో వ్యవహరిస్తుందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై 50% సుంకాలు విధించినా, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 25% జరిమానా విధించినా తాము వెంటనే స్పందించలేదని అన్నారు. "విశాల హృదయం ఉన్నవారు ప్రతీదానికి వెంటనే స్పందించరు" అంటూ ఆయన భారత దౌత్య వైఖరిని పరోక్షంగా సమర్థించుకున్నారు.

### సింగరేణి ఉద్యోగులకు
## దసరా బోనస్ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి)** :దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు భారీ శుభవార్త అందించింది. సంస్థకు వచ్చిన లాభాల్లో వాటాగా ప్రతి కార్మికుడికి రూ. 1,95,610 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో సుమారు 71 వేల మంది కార్మికుల కుటుంబాల్లో పండగ శోభ ముందుగానే వచ్చినట్లయింది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం వెల్లడించారు. సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో అద్భుతమైన పనితీరు కనబరిచిందని ఆయన తెలిపారు. సంస్థ మొత్తం రూ. 6,394 కోట్లు ఆర్జించగా, అన్ని ఖర్చులు పోను నికరంగా రూ. 2,360 కోట్ల లాభం వచ్చిందని వివరించారు. ఈ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు బోనస్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ బోనస్ పంపిణీ కోసం ప్రభుత్వం మొత్తంగా రూ. 819 కోట్లను విడుదల చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోజనం సింగరేణిలోని శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... "సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ఆత్మలాంటిది. ఇది కేవలం బొగ్గు గని మాత్రమే కాదు, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఒక ఉద్యోగ గని" అని అన్నారు. భవిష్యత్తులో సింగరేణిని కేవలం బొగ్గుకే పరిమితం చేయకుండా, కీలక ఖనిజాల మైనింగ్ రంగంలోకి కూడా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దసరా బోనస్‌తో పాటు దీపావళి సందర్భంగా కూడా కార్మికులకు మరో బోనస్ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



## భూగర్భ సంపులతో.... సత్ఫలితం

- **ఖైరతాబాద్ కేసిపీ జంక్షన్ లో భారీ వర్షం**
- **జీహెచ్ఎంసీ నిర్మించిన భూ గర్భ సంపులతో నిమిషాల్లోనే వర్షపు నీటి కట్టడి**
- **వేగంగా ట్రాఫిక్ క్లియర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): నగరంలో ఓ మోస్తారు వర్షం పడిందంటే చాలు జంక్షన్ లో, లోతట్టు ప్రదేశాల గుండా వెళ్ళే మార్గాలలో వరద నీరు భారీగా నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యకృతం అయ్యేవి.
గంటలకు కొద్దిగా ట్రాఫిక్ నిలిచిపోయేది. నగరంలో ఇటీవల నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ (భూ గర్భ సంపులు)తో ఈ బాధల నుంచి విముక్తి లభిస్తుంది.

- **భారీ వర్షం... నిమిషాల్లోనే వరద కట్టడి....**

ఖైరతాబాద్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఒక్క సారిగా 7.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది.భారీ వర్షానికి కేసిపీ జంక్షన్ కూడలిలో పెద్ద మొత్తంలో నీరు నిలిచింది. ట్రాఫిక్ జామ్ అయ్యింది.సాధారణంగా ఇక్కడ ఈ స్థాయి వర్షం పడితే నీరు నిలిచి 3 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రజలు ఇబ్బంది పడేవారు.కేసిపీ జంక్షన్ వద్ద 3 లక్షల సామర్థ్యంగల, ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం వద్ద 7 లక్షల సామర్థ్యం, మొత్తం ఈ రెండు ప్రదేశాల్లో 10 లక్షల సామర్థ్యంగల రెండు హోల్డింగ్ స్ట్రక్చర్స్ (భూ గర్భ సంపులు) నిర్మాణం జీహెచ్ఎంసీ చేపట్టడంతో 20 నిమిషాల్లోనే లాగింగ్ అయిన వాటర్ క్లియర్ అయ్యింది.

- **ట్రాఫిక్ సాధారణ స్థితికి వచ్చింది : కేసిపీ జంక్షన్ కూడలిని సందర్శించిన మేయర్**

కేసిపీ జంక్షన్ కూడలిలో వర్షం వల్ల భారీగా వరద నీరు నిలిచిందన్న సమాచారం అందుకున్న వెంటనే జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కేసిపీ జంక్షన్ కూడలినీ సందర్శించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ పోలీసులతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.దగ్గరుండి వరదనీటినీ వేగంగా క్లియర్ అయ్యేలా చూసారు.

- **బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలి:మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.**

బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలనీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులకు సూచించారు. బతుకమ్మ కుంటను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులతో కలిసి ఏర్పాట్లను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఏర్పాట్లపై అధికారులకు మేయర్ విజయలక్ష్మి దిశా నిర్దేశం చేశారు.

### నేటి నుంచి కొత్త జీఎస్టీ...
## ప్రతిపక్షాల విమర్శలపై అమిత్ షా స్పందన

**ఢిల్లీ, సెప్టెంబర్ 22 (భారత శక్తి)** :దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కీలక మార్పులు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన తర్వాత చేపట్టిన అతిపెద్ద సంస్కరణల్లో భాగంగా పలు వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ మార్పుల ద్వారా దేశంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పరస్పర విశ్వాసంతో కూడిన సరికొత్త శకం ప్రారంభమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. కొత్త విధానం ప్రకారం, ప్రస్తుతం ఉన్న 5%, 12%, 18%, 28% శ్లాబుల స్థానంలో కేవలం 5%, 18% అనే రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయి. ఈ మార్పుల వల్ల నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, ఆరోగ్య బీమా, విద్యుత్, సిమెంట్, కార్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి అనేక ఉత్పత్తులు చౌకగా లభించనున్నాయి. అత్యంత విలాసవంతమైన వస్తువులపై 40% పన్ను విధించనుండగా, పొగాకు ఉత్పత్తులు మాత్రం పాత 28% ప్లస్ సెస్ పరిధిలోనే కొనసాగుతాయి. ఈ సంస్కరణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ,



"ఇది దేశంలో నమ్మకంపై ఆధారపడిన పన్నుల వ్యవస్థకు నాంది పలుకుతుంది. ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికే పన్నులు విధిస్తారనే భావనను ఇది తొలగిస్తుంది. దేశాన్ని నడపడానికే పన్నులు వసూలు చేస్తారనే నమ్మకాన్ని 130 కోట్ల ప్రజల్లో కలిగిస్తుంది" అని వివరించారు.

ఈ నిర్ణయంతో దేశంలో ఉత్పత్తి, వినియోగం రెండూ పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ సంస్కరణలను 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా వేసిన పెద్ద అడుగుగా అభివర్ణించారు. నవరాత్రుల మొదటి రోజున దేశంలో 'జీఎస్టీ పొదుపు పండుగ' ప్రారంభం కాబోతోందని ఆయన పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు యువత, మహిళలు, వ్యాపారులకు ఈ సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయని ఆయన అన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలపై అమిత్ షా విమర్శలు చేశారు. "కొందరు రాజకీయ నాయకులు జీఎస్టీని అపఖ్యాతి పాలు చేశారు. అది విజయవంతమవడం చూసి, ఆ ఆలోచన మాదేనంటూ ముందుకు వచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వాళ్లు ఎందుకు అమలు చేయలేకపోయారు?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రాలు రాజ్యాంగ హామీ కోరగా, వారు ఇవ్వలేకపోయారని, కానీ మోదీ ప్రభుత్వం ఆ హామీ ఇచ్చి రాష్ట్రాల నమ్మకాన్ని చూరగొన్నందునే జీఎస్టీ విజయవంతమైందని షా స్పష్టం చేశారు.

# పండుగలు ప్రమాదాలు కొనితేవద్దు..

- ఉత్సవాలు భక్తిగా, ఆహ్లాదకరంగా జరుపుకోవాలి..
- బతుకమ్మ, దసరా నవరాత్రులు మొదలయ్యాయి..
- ఊరు ఊరునా, వాడ వాడలా వెల్లివిరిసిన ఆనంద కేళి..
- ఆర్భాటాలకు పోవడం ఏ దేవుడూ, ఏ దేవతా హర్షించరు..
- ఈ దసరా సెలవులను ఒక జ్ఞాపకంగా మలుచుకోండి..
- ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.. వినియోగించుకోండి..
- పోలీసులకు, అధికారులకు సహకరించండి..
- మద్యపానానికి, మాంసాహారానికి దూరంగా ఉండండి..
- ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించండి..
- భారత శక్తి పాఠకులకు దసరా, బతుకమ్మ శుభాకాంక్షలు అందజేస్తోంది
- " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

**(స్పెషల్ కరస్పాండెంట్)**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (భారత శక్తి) : బతుకమ్మ, దసరా నవరాత్రుల వైభవానికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలియజేశారు.. ఇక తెలంగాణ రాష్ట్రం యావత్తూ పండుగల సందడిలో మునిగిపోయింది. బతుకమ్మ, దసరా నవరాత్రులు ప్రారంభమవడంతో నగరంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉత్సాహ వాతావరణం నెలకొంది. సాంప్రదాయ వైభవం, సాంస్కృతిక సొబగులు చాటే ఈ రెండు పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.









**బతుకమ్మ విశిష్టత :**

స్త్రీ శక్తి, ప్రకృతి పట్ల కృతజ్ఞతలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తెలంగాణ అంతటా ఘనంగా జరుపుకుంటారు. మహిళలు పూలతో బతుకమ్మను అలంకరించి, పాటలు పాడుతూ, ఊరంతా సంబురంగా ఆడిపాడుతారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడేలా ప్లాస్టిక్ పదార్థాలు వాడకూడదని అధికారులు సూచించారు.

**దసరా నవరాత్రులు :**

అలాగే శక్తి ఆరాధన పర్వదినాలైన దసరా నవరాత్రులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సాగుతున్నాయి. తొమ్మిది రోజులపాటు అంబాదేవిని వివిధ అవతారాల్లో భక్తులు పూజిస్తున్నారు. విజయదశమి సందర్భంగా ధర్మం చెడుపై గెలిచిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ సాంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

సామూహిక వేడుకల్లో గుంపులు ఎక్కువగా ఉండే కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది ప్రభుత్వం.. పిల్లలను కంట్లో పెట్టుకుని జాగ్రత్తగా చూడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.. ఇక చెరువుల్లో బతుకమ్మ వదిలే సమయంలో నీటి కాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పర్యావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది...



దసరా సందర్భంగా పటాకులు, దీపాల వాడకంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు పలు సూచనలు చేసింది..

**ప్రభుత్వ ఏర్పాట్లు :**

చెరువులు, సరస్సుల వద్ద ప్రత్యేక ఘాట్‌లు, కాంతివంతమైన లైటింగ్ ఏర్పాటు చేశారు.. శానిటేషన్ సిబ్బంది ద్వారా శుభ్రత పనులు చేపట్టారు.. వైద్య బృందాలు, అత్యవసర అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచినట్లు తెలియజేశారు.. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసుల ప్రత్యేక బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు..

రవాణా సౌకర్యాల కోసం ఆర్.టి.సి. ప్రత్యేక బస్సులు నడుపుతోంది.. సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ పోటీలు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోంది.. మొత్తం మీద రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాలతో బతుకమ్మ, దసరా నవరాత్రులను జరుపుకుంటుండగా, ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## మురికికాలువల మరమ్మతులు చేపట్టిన
# నగరపాలక అధికారులు

కరీంనగర్ సెప్టెంబర్ 22(భారత శక్తి) దశాబ్దపు కాలపు నాలాలు అనే శీర్షిక భారత శక్తి లో వెలువడగా నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించారు. సోమవారం నగరంలోని 53వ డివిజనలోని కాశ్మీర్ గడ్డ లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి..వెంటనే నగర పాలక అధికారులు మురికికాలువల మరమ్మతులు చేపట్టారు...అలాగే కొన్ని మురికి కాలువలు కూలిపోయాయి...దీంతో కాలని వాసులు ఆందోళన చెందగా భారత శక్తిలో 20 ఏళ్ల కిందట నాలాలపై పర్యవేక్షణ కరువైందని ప్రచురించింది...వెంటనే స్పందించిన నగర పాలక కమిషనర్, అధికారులకు ప్రజల పక్షాన మాజీ నగర మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.







## వరద ముంపు కాలనీలలో ప్రజలకు
# ఇబ్బందులు కలగకుండా చూడాలి

- * జోనల్ కమిషనర్ తో మధుయాష్కి గౌడ్
- * అన్ని విభాగాల అధికారులతో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచన



ఎల్బీనగర్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): భారీ వర్షాల వల్ల ముంపు కాలనీలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని, వరద నీటిని తొలగించాలని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్ సూచించారు. సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షంతో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో వరద నీటి సమస్యలు తలెత్తాయి. మరీ ముఖ్యంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్, హయత్ నగర్ డివిజన్ మన్సూరాబాద్ డివిజన్ తదితర ప్రాంతాలలో పలు కాలనీలలో వరద నీరు వచ్చిన విషయం తెలుసుకున్న మధుయాష్కి వెంటనే స్పందించి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ తో మాట్లాడారు.భారీ వర్షాలతో నియోజకవర్గంలోని పలు కాలనీలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాలను వివరించారు. తక్షణమే స్పందించి ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. మరీ ముఖ్యంగా హరిహరపురం కాలనీ, కాప్రాయ చెరువు కింది కాలనీలో అయిన అఖిలాండేశ్వరి నగర్, స్నేహ మయి నగర్, గాంధీ నగర్ లతో పాటు మహాలక్ష్మి నగర్, గాయత్రి నగర్ తదితర కాలనీలో వరద నీరు ప్రవహిస్తుందని, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు.జిహెచ్ఎంసి, హైడ్రా, డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ తదితర విభాగాలన్నీ సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే తమ సిబ్బందిని, అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు వారికి ఇబ్బందులు లేకుండా సహాయం చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## వరద ముంపు బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 22 (భారత శక్తి): గత నాలుగు రోజుల నుండి పడుతున్న భారీ వర్షాలకు గాను హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీ, రంగ నాయకుల గుట్ట పరిసర ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి.దానిలో భాగంగా సోమవారం ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఉదయం నుంచి అన్ని విభాగాల అధికారులను సమన్వయపరచుకుంటూ బాధితులకు తక్షణసాయం క్రింద 20,000 రూపాయలు ఇవ్వాలని అలాగే వారికి భోజన సౌకర్యం కల్పించాలని కోరారు.అలాగే మీద ఉన్న ఇంజపూర్ నుండి వచ్చే వరదనీటి ప్రవాహం వల్లే బంజారా బస్తీ మునిగిపోయిందని అన్నారు. నూతన ట్రంక్ లైన్ అతి త్వరలోనే ప్రారంభం కావడం జరుగుతుందని, పనులు సకాలంలో పూర్తి అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.



ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, గుడాల మల్లేష్, భాస్కర్ సాగర్, జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.